ఈనాడు
శ్రీకాకుళం
సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు

వ్యవసాయ యాంత్రీకరణకు కేటాయించిన నిధులు	రూ.30 కోట్లు
ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ	రూ.10.50 కోట్లు
సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మిషనరీ	రూ.8.75 కోట్లు
రాష్ట్రీయ విజ్ఞాన్ యోజన	రూ.10.75 కోట్లు



- రూ. 30 కోట్లు కేటా'యింపు'లేనా!
- ఖరీఫ్ దాటుతున్నా అందని యంత్రాలు
- దరఖాస్తుల స్వీకరణలోనూ జాప్యమే
- పెట్టుబడుల పెరుగుదలపై రైతుల ఆందోళన

యాంత్రీ'కరుణ' ఏదీ?!

నిధులు కేటాయించారు. యూనిట్ల లక్ష్యాలు నిర్ణయించారు. అవసరమైన ట్రాక్టర్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీ పడుతున్నాయి. తీసుకోవడానికి రైతులూ సిద్ధంగా ఉన్నారు. ఇతర యంత్ర పరికరాల కోసం మాత్రం రైతులు తిరుగుతూనే ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో ఒక్కటంటే ఒక్క యంత్రం రైతుల దరి చేరలేదు. ఇప్పటికే లక్షల ఎకరాల్లో సాగు పూర్తయింది. ఇప్పుడు తీరిగ్గా యంత్రాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తుండడం వల్ల ఏం ప్రయోజనం?!

న్యూస్‌టుడే - రాజాం

ఉభయ గోదావరి జిల్లాలకు దీటుగా సిక్కోలులో సాగు విస్తీర్ణం నమోదవుతోంది. అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా వ్యవ'సాయం' అందిస్తోంది. ఇందుకు యాంత్రీకరణే తార్కాణం. జిల్లాకు రూ. 24 కోట్లు కేటాయించగా, ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి జిల్లా కలెక్టర్ మరో రూ. 6 కోట్లు అందించేందుకు అంగీకరించారు. మొత్తంగా రూ. 30 కోట్లతో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాల్సి ఉంది. మరోవైపు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ (ఎస్‌డీపీ), సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మిషనరీ (ఎస్‌ఎంఏఎం), రాష్ట్రీయ విజ్ఞాన్ యోజన (ఆర్‌కేవీవై) పథకాల కింద ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇస్తోంది. వీటి కింద యూనిట్ల లక్ష్యాలు నిర్దేశించింది. ఖరీఫ్ కాలానికి ముందే పక్కా ప్రణాళిక అమలు చేస్తే ఈపాటికే రైతులకు యంత్రాలు అందేవి. ఖరీఫ్‌లో వీటిని వినియోగించుకుంటే వ్యవసాయ పెట్టుబడులు గణనీయంగా తగ్గేవి. అలా జరగకపోవడంతో సాగు పెట్టుబడులు పెరిగి తడిసి మోపెడవుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పొలం చూడని 'రైతు రథం'

జిల్లాకు 'రైతు రథం' కింద 360 ట్రాక్టర్లు కేటాయించారు. ఇందులో 4 వీల్‌డ్రైవ్ 60 ట్రాక్టర్లు కాగా.. 2వీల్‌డ్రైవ్ 300 ట్రాక్టర్లున్నాయి. 4వీల్‌డ్రైవ్‌కు సంబంధించి రూ. 2 లక్షలు రాయితీ ప్రభుత్వం అందిస్తోంది. రొటోవేటర్ తీసుకుంటే మరో రూ. 50 వేలు రాయితీ కలిపి రూ. 2.50 లక్షలు రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. 2వీల్‌డ్రైవ్ ట్రాక్టర్లకు సంబంధించి ట్రాక్టర్‌కు రూ. 1.50 లక్షలు రాయితీ ఇవ్వనుండగా, రోటోవేటర్ తీసుకుంటే అదనంగా మరో రూ. 50 వేలు రాయితీ పెంచి రూ. 2 లక్షలు రాయితీగా అందిస్తారు. మిగిలిన డబ్బులు బ్యాంకులే రుణంగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. మొత్తం ట్రాక్టర్లన్నీ తామే ఇస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఇప్పటికే ప్రతిపాదించింది. పంట, ఇతరత్రా రుణాల కంటే ట్రాక్టర్లపై రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీపడుతున్నాయి. ఇప్పటికే రైతులకు ట్రాక్టర్లు (మిగతా 15వ పేజీలో)

యూనిట్ల లక్ష్యాలు

రైతు రథం కింద ట్రాక్టర్లు	360
ఎస్ఎంఏఎం కింద మినీ ట్రాక్టర్లు	100
ట్రాక్టర్ పరికరాలు	1,150
పవర్ స్ప్రేయర్లు	200
రోటోవేటర్లు	80
రేపర్లు	100
పవర్ టిల్లర్లు	85
ఫాంమిషనరీ బ్యాంకులు	30



మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో కాటేస్తుందో తెలియదు. ఆ యువకులు అంతవరకు ఓ శుభకార్యంలో సరదాగా గడిపారు. అనంతరం వారిలో ఒకరి సొంతూరికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఊరు చేరక మునుపే కాలువ రూపంలో విధి వారి ప్రాణాలు బలితీసుకుంది. కన్నవారికి పుట్టెడు శోకం మిగిల్చింది.

జల సమాధి!

- కాలువలో జారి పడి ఇద్దరు యువకుల మృతి
- కాళ్లు కడుక్కోవడానికి దిగి అనంత లోకాలకు.. ● రేగిడి మండలంలో విషాదం



దాసరి రామరాజు (పాత చిత్రం)



దుప్పాడ రోహిత్‌నాయుడు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే

రేగిడి మండలం పోరాం గ్రామం సమీపంలోని మడ్డువలస ప్రధాన కాలువలో జారిపడి రాజాం నగర పంచాయతీ పరిధిలోని గాంధీవీధికి చెందిన దుప్పాడ రోహిత్ నాయుడు (18), డోలపేట మారుతీనగర్ కాలనీకి చెందిన దాసరి రామరాజు (19) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. పోలీసులు, స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. రోహిత్‌నాయుడు తన అన్న అభిలాష్‌నాయుడు, సమీప బంధువు రామరాజు డోలపేటలో ఆదివారం ఓ శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం రోహిత్‌నాయుడు సొంతూరైన రేగిడి మండలం కోడిశకు ద్విచక్ర వాహనంపై మడ్డువలస కుడి ప్రధానకాలువ పైనుంచి వెళ్తున్న సమయంలో ఇద్దరి కాళ్లకు మట్టి అంటింది. కాళ్లను కడుక్కునేందుకు పోరాం యూటీ (మిగతా 15వ పేజీలో)



కనీస ప్రమాణాలూ కరవు!

- సామర్థ్యం లేకుండానే తరగతులు మారిపోతున్నారు..!!
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దైన్యం
- అసర్ సర్వే నివేదికలో వెల్లడి

న్యూస్‌టుడే - పాత శ్రీకాకుళం

ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 21.4 శాతం మంది రెండో తరగతి పాఠ్యపుస్తకాన్ని సైతం చదవలేకపోతున్నారు.

ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థుల్లో సుమారు సగం మంది అంటే 48.8 మంది నామమాత్ర భాగాహారాలు సైతం చేయలేకపోతున్నారు.

మూడు నుంచి అయిదు తరగతుల విద్యార్థుల్లో అయితే కనీసం ఒకటో తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవలేకపోతున్నవారు 25.7 శాతం మంది. చిన్న తీసివేతలు సైతం చేయలేకపోతున్నవారు 32.4 శాతం మంది ఉన్నారు.

..ఇదీ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యార్థుల ప్రమాణాల పరిస్థితి.

ప్రథమ్ అనే స్వచ్ఛంద సంస్థ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సర్వే అనంతరం రూపొందించిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్' (అసర్) నివేదిక (మిగతా 15వ పేజీలో)

నాలుగు రోజులు.. మూడు జాబితాలు!



- అయినవారి కోసం అడ్డదారులు ● ఆ అధికారే సూత్రధారి
- ఆరోగ్య కార్యకర్తల నియామకాల్లో ఆగని అక్రమాలు

ఈనాడు - శ్రీకాకుళం

ఆరోగ్య కార్యకర్తల ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోతున్నాయి. అయినవాళ్ల కోసం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాలే మారిపోతున్నాయి. ఈ జాబితాను రూపొందిస్తున్న కీలక అధికారులు తమ కనుసన్నల్లోనే జాబితాలను మార్చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సంబంధం లేని అధికారులకు అర్హుల జాబితా రూపకల్పన బాధ్యతలు అప్పగించడమే అక్రమాలకు మూలంగా భావిస్తున్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే మూడు జాబితాలు తెరపైకి రావడం అక్రమాలకు అద్దం పడుతోంది. జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి స్వయంగా దృష్టి సారిస్తే తప్ప తమకు న్యాయం జరిగే అవకాశాలు లేవని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఓసీలో చూపించాల్సి ఉన్నా..

మొదటి జాబితాలో మొత్తం 74 మంది ఉన్నారు. ఓసీ విభాగంలో కనీసం 61 మార్కుల వరకు సాధించిన అభ్యర్థులను అర్హుల జాబితాలో చేర్చారు. అంటే ఓసీ అభ్యర్థులకే అది కటాఫ్ మార్కులు అయితే.. అంతకంటే ఎక్కువ మార్కులు సాధించుకున్న ఇతర వర్గాలకు చెందిన అభ్యర్థులను కూడా ఇదే అర్హత జాబితాలో చేర్చాలి. ఇంతకంటే అధికంగా అంటే.. 66 మార్కులు సంపాదించుకున్న అభ్యర్థులను సైతం బీసీ కేటగిరీలో చూపించారు. నిబంధనల మేరకు ఈ అభ్యర్థిని సైతం ఓసీ కేటగిరీలోనే చూపించాలి. మొదటి జాబితాలో అలా చూపించలేదు. అలాగే 78 మార్కులు వచ్చిన అభ్యర్థిని సైతం ఓసీలో చూపించకుండా.. బీసీ-డీలో (మిగతా 15వ పేజీలో)

సంబంధం లేని అధికారికి బాధ్యతలు

అభ్యర్థుల జాబితాలు రూపొందించిన కీలక అధికారికి ఉద్యోగ నియామకాల విభాగంతో ఎలాంటి సంబంధం లేదు. సాధారణ సెక్షన్‌ను పర్యవేక్షించే అధికారికి ఈ నియామక బాధ్యతలు అప్పగించడం వెనక అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. మళ్లీ మళ్లీ జాబితాలను మార్పులు చేయడం.. తారుమారు చేయడం.. అసలు ఉద్యోగాలకు ఆమోదం లేకపోయినా.. జాబితాను పెంచుకుంటూ పోవడం ఆరోపణలకు అద్దం పడుతోంది. దీని వెనక గతంలో మాదిరి వసూళ్ల వ్యవహారాలకు గ్యాంగ్‌ను రంగంలోకి దింపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు కూడా నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రూ. కోట్లలో వసూళ్లు.. తమ చేతికి మట్టి అంటక పోవడం వంటి అంశాలకు ఉన్నత స్థాయి అధికారులు కూడా తలొగ్గారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వెబ్‌సైట్‌లో జాబితాల మార్పేమిటి..?

మొదటి జాబితా	రెండో జాబితా	మూడో జాబితా
ఆగస్టు 16న- 74 మంది	ఆగస్టు 17న - 77 మంది	ఆగస్టు 19న - 120 మంది

సరిహద్దు పాఠశాలలో సంకల్ప 'మొక్క'తీరుగ..!



నీలగిరి మొక్క లక్షణాలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

- పర్యావరణ నిలయంగా విద్యాలయం
- కూరగాయల మొక్కల పెంపకం
- ఆహ్లాదకర వాతావరణంలో తరగతుల నిర్వహణ
- ఆదర్శంగా నిలుస్తున్న ముచ్చింద్ర పాఠశాల



హరితవనంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర సరిహద్దునున్న గ్రామంలోని పాఠశాలలో అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చదువుకోవాలన్న తలంపుతో పర్యావరణ ప్రేమికుడైన ప్రధానోపాధ్యాయుడి కృషికి అద్దం పడుతుంది అక్కడి వాతావరణం. దీంతో ఒకప్పుడు తక్కువమంది పిల్లలు ఉండే ఆ పాఠశాలలో ఇప్పుడు పెద్దసంఖ్యలో పిల్లలు చదువుతున్నారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో విద్యతో పాటు పర్యావరణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ మొక్కలపెంపకం, వాటి ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులను పర్యావరణ ప్రేమికులుగా తీర్చిదిద్దుతున్నారు. అదే ఇచ్ఛాపురంలో ముచ్చింద్రలోని ప్రభుత్వ పాఠశాల. ఆదర్శంగా నిలుస్తున్న ఈ పర్యావరణ పాఠశాలపై స్ఫూర్తి కథనం.

(న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మండలం నుంచి ఒడిశాను కలిపే గ్రామం ముచ్చింద్ర. అక్కడివారంతా సామాన్య రైతులు, కూలీలే. ఆ గ్రామానికి దూరంగా ఉన్న ప్రభుత్వ బడి పచ్చదనంతో కళకళలాడుతోంది. గ్రామ సర్పంచి సాడి డిల్లేశ్వరరావు సహకారంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సుహాస్‌చంద్ ప్రత్యేక దృష్టిపెట్టి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడంతో ఇప్పుడు ఆ పాఠశాలంతా పచ్చదనం సంతరించుకొంది. ఇక్కడి విద్యార్థులకు కేవలం తరగతి గదిలో పాఠాలే కాకుండా, ప్రకృతి పాఠాలను కూడా బోధిస్తున్నారు. గతేడాది ఇక్కడే పండ్లు, కూరగాయలను కూడా సాగుచేశారు. ఆ కూరగాయలనే ప్రతిరోజు మధ్యాహ్న భోజనంలో వండి పిల్లలకు పుష్టికాహారాన్ని అందిస్తున్నారు. కూరగాయల మొక్కలతో పాటు ఔషధగుణాలు ఉన్న వృక్షజాతి మొక్కలు, పండ్లు, వివిధరకాల పర్యావరణహిత మొక్కలను తెచ్చి ఆవరణలో నాటారు. రోజూ సాధారణ తరగతులతో పాటు ఒక గంట పాటు పర్యావరణ పాఠాలను చెబుతున్నారు. విత్తనం నుంచి చెట్టుగా ఎదిగే క్రమాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు, జీవకోటికి వృక్షజాతి వలన కలిగే ఉపయోగాలను తెలియజేస్తున్నారు. పూల దశ నుంచి కాయలు, పండ్లు వచ్చే విధానాలను వివరిస్తున్నారు. ఔషధగుణాలు ఉన్న ఆకులు, వేర్లను చూపించి వాటి లక్షణాలను వివరిస్తున్నారు. ప్రతిరోజు గంట సేపు విద్యార్థులంతా ఉత్సాహంగా వృక్షాల నడుమ తిరుగుతూ వాటిగురించి తెలుసుకుంటుండంతో వారికి పర్యావరణంపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పాఠశాల ప్రాంగణంలో జామ, అరటి, నీలగిరి, టేకు, సీతాఫలం, వివిధ రకాల పుష్పజాతి మొక్కలు, చెట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

ప్రకృతి బడిలో కూరగాయల సాగు

జిల్లాలో ప్రతీ బడిలోనూ కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలన్న గత కలెక్టరు డా. లక్ష్మీనరసింహం సూచనలను తొలుత ముచ్చింద్ర పాఠశాల నుంచే ఆ కార్యక్రమం ప్రారంభించారు. మొదట్లో నాలుగురకాల కూరగాయలను తెచ్చి, పాఠశాల ఆవరణలో పెంచడం ద్వారా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించగలిగారు. అయితే గత వేసవి సెలవుల్లో అవన్నీ పూర్తిగా నాశనమవడంతో ఇటీవల వర్షాలు పడడంతో మళ్లీ తోటకూర, వంకాయ, ఆనపకాయ, బెండ, బీర, టమాట, చిక్కుడు, మెంతుకూరల విత్తనాలు కొనుగోలు చేసి వేసినట్లు ప్రధానోపాధ్యాయుడు సుహాస్‌చంద్ పేర్కొన్నారు. వీటన్నింటిని బడి ఆవరణలోనే వేశామన్నారు. పండ్ల జాతివృక్షాల నుంచి వచ్చే దిగుబడులను పిల్లలకే పంచిపెడుతున్నామని, ఇటీవల బొప్పాయి పండ్లను అందించామని ఆయన వివరించారు. ఒడిశాకు ఆనుకొని ఉన్న ఈ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న తీరు చూసిన ఈ పాఠశాల పరిధిలోని స్కూల్‌కాంప్లెక్స్ అధ్యక్షులు దుక్క లోకేశ్వర రెడ్డి విద్యార్థుల కృషిని, ఆసక్తిని మెచ్చుకొని వారికి రూ.3వేలు విలువ చేసే ఆట పరికరాలను అందించారు. ప్రధానోపాధ్యాయుడి ఆశయానికి సహచర ఉపాధ్యాయులు సహకారమందిస్తుండడంతో అక్కడ పచ్చదనం వెల్లివిరుస్తోంది.



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీవో, హెచ్ఎం (దాచిన చిత్రం)

సంరక్షించే బాధ్యత అప్పగించాం



ఒకప్పుడు కేవలం 30 మంది విద్యార్థులే ఉండేవారు. దీనికి కారణం పాఠశాల పరిసరాలు బాగుండకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇక్కడికి తమ పిల్లల్ని పంపేందుకు ఇష్టపడేవారు కాదు. ఈ విషయాన్ని గ్రహించి పాఠశాలలో మార్పు తెచ్చేందుకు కృషి చేశా. దానికి గ్రామ పెద్దలంతా సహకరిస్తున్నారు. మధ్యాహ్నభోజన పథకంలో అక్కడే పండించిన కూరగాయలను వాడుతున్నాం. మొక్కల పెంపకం బాధ్యతను ఒక్కో విద్యార్థికి ఇచ్చాం. పర్యావరణం పెంపునకు ప్రతిఒక్కరం కృషిచేస్తున్నాం. దీంతో పచ్చదనం పెరిగి పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

–కె.సుహాస్‌చంద్, ప్రధానోపాధ్యాయులు, ముచ్చింద్ర ప్రాథమిక పాఠశాల, ఇచ్ఛాపురం

ఉత్సాహంగా పాఠశాలకు వెళతాం



బడి అంటేనే చదువులు, బట్టీ పట్టడాలు, వాటిని నోట్సుగా రాయడాలే అనుకునేవారికి సమాధానం మా పాఠశాల. ప్రతిరోజు బడికి వెళ్లడానికి ఎంతో ఉత్సాహం చూపుతాం. రాగానే బడి మొత్తం తిరుగుతాం. ప్రతీ మొక్కను పరిశీలిస్తాం. ఏ మొక్క అయినా సరిగా లేకుంటే వెంటనే ఉపాధ్యాయుడికి చెప్పి సరిచేస్తాం. మొక్కల్ని సంరక్షించుకొంటాం.

–కూన మోహనరావు, విద్యార్థి, ఐదోతరగతి, ముచ్చింద్ర

మొక్కల ఆవశ్యకత తెలుసుకున్నాం



మొక్కల వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకున్నాం. పూలను పెట్టుకోవాలని తహతహలాడుతుంటాం. అవి ఎలా పుడతాయి. వాటి జాతులు ఏంటి, ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కల రకాలేమిటి.. ఇవన్నీ మా ఉపాధ్యాయులు బాగా చెబుతున్నారు. కొత్తగా ఎక్కడైనా ఓ మొక్క కనిపిస్తే చాలు తెచ్చి ఉపాధ్యాయులకు చూపిస్తుంటాం. వెంటనే దాని గురించి తెలుసుకుంటాం. –రత్నాల దీప్తి, 5వ తరగతి, ముచ్చింద్ర

సమాజాభివృద్ధికి నైపుణ్యాలను ఉపయోగించండి

ముగిసిన ఎన్‌వైకే శిక్షణ కార్యక్రమం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శిక్షణలో నేర్చుకున్న అంశాలు సమాజాభివృద్ధికి ఉపయోగించాలని ఆర్డీవో దయానిధి అన్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఐదు జిల్లాలకు చెందిన 15 రోజులపాటు ఇచ్చిన శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి అవరోధాలుగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం వివిధ రకాల వ్యక్తులతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యపట్ల పనిచేయటానికి తగిన సన్నద్ధతపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ఒక వలంటీర్‌గా గ్రామంలో యువతను సంఘటితం చేసి పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. శిక్షణ ఇన్‌ఛార్జి ఆచార్య డి.విష్ణుమూర్తి మాట్లాడుతూ శిక్షణలో జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వవికాసం, నాయకత్వ లక్షణాలు వంటి పలు అంశాలు నేర్పించటం జరిగిందన్నారు. అంతకముందు నెహ్రూయువకేంద్రం జిల్లా సమన్వయకర్త కె.వి.రమణ మాట్లాడుతూ వలంటీర్‌కు సామాజిక సేవా కార్యక్రమాలు చేసే ఆత్మస్థైర్యం, స్ఫూర్తి శిక్షణ ద్వారా అందించామన్నారు. నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో చేసి చూపించాలని కోరారు. సెట్‌శ్రీ సీఈవో ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో యువజన సంఘాల పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. భద్రతా దళాల్లో ఉద్యోగాలకు సెట్‌శ్రీ ద్వారా ఉచితంగా 650 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించామని కొద్ది రోజుల్లో ఈ శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్షేత్రప్రచారాధికారి కొండలరావు, శివ శక్తి యువజన సంఘం అధ్యక్షుడు పి.ధనంజయరావు , ఆచార్య వేణుగోపాల్, రిసోర్స్‌పర్సన్ రోజారమణి, ఎన్‌వైకే ప్రతినిధులు సత్యనారాయణ, ఉమాశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో బలివాడ దయానిధి

జిల్లాలో రూ.420 కోట్ల పనుల కల్పనే లక్ష్యం

డ్వామా పీడీ హనుమంతు కూర్మారావు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో 2017-18 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.420 కోట్ల ఉపాధిహామీ పనుల కల్పనే లక్ష్యమని డ్వామా పీడీ హనుమంతు కూర్మారావు అన్నారు. ఆదివారం పొందూరు మండలం ఉపాధిహామీ పథకం కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ.219 కోట్లు వేతనాల రూపంలోను, రూ.38 కోట్లు మెటీరియల్ పనులకు వెచ్చించినట్లు తెలిపారు. ఒక్కో వేతనదారుడికి సరాసరి దినసరి కూలీ రూ.125 చెల్లించామని, ఇందులో అత్యధికంగా సంతబొమ్మాళిలో రూ.157, అత్యల్పంగా వంగరలో రూ.75 ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ఎన్టీఆర్ జలసిరి, పంట సంజీవని, క్రీడా మైదానాల ఏర్పాటు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కల పెంపకం, పూడికతీత వంటి తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఏడు రకాల దస్త్రాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆయన చెప్పారు.

పురోగతి ఎలా సాధిస్తారు.?: గ్రామాల్లో అవసరమైన క్షేత్ర సహాయకులు లేకపోతే పురోగతి ఎలా సాధిస్తారంటూ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యాన్ని ఆయన ప్రశ్నించారు. మండలంలో 29 పంచాయతీలకు గాను కేవలం ఆరుగురు క్షేత్ర సహాయకులు మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన 23 పంచాయతీల్లో వారి నియామకానికి చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. పంటకుంటల నిర్మాణంలో మండలం వెనుకంజలో ఉందని, ఇప్పటివరకూ 71 మాత్రమే పూర్తి చేయడంతో సీఎం డ్యాష్ బోర్డులో రెడ్‌మార్క్ చూపుతుందన్నారు. ఈ నెలాఖరుకు నాటికి 154 పంటకుంటలను పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం కార్యాలయం వర్షాలకు కారుతుందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ కొత్త భవనం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలంటూ ఎంపీడీవోకు సూచించారు. ఆయన వెంట జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, టీఏలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ హనుమంతు కూర్మారావు

తెల్ల బంగారం వైపు మొగ్గు

- జిల్లాలో పెరుగుతున్న పత్తి సాగు విస్తీర్ణం
- దళారులను అడ్డుకుంటేనే మేలు
- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగు..



భామిని, న్యూస్‌టుడే

జిల్లాలో రైతులు తెల్ల బంగారమైన పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పత్తి విస్తీర్ణం పెరిగింది. ఈ సారి పత్తినే ప్రధాన పంటగా ఎంచుకున్నారు. సాగు నీటి సౌకర్యాలు సరిగా లేని ప్రాంతాల్లో వర్షాధార పంటగా వేస్తున్నారు. మార్కెట్‌లో పత్తికి మంచి ధరలు లేక పోవడంతో పత్తికి బదులు పత్యామ్నాయ పంటలైన పప్పుధాన్యాలు సాగు చేయాలని గత ఏడాది వ్యవసాయాధికారులు రైతులకు సూచించినా ఈ ఏడాది జిల్లాలో దాదాపు 8 వేల హెక్టార్లుకు పైనే రైతులు పత్తి సాగు చేపట్టారు. గత రెండు సంవత్సరాల క్రితం పత్తికి తగిన గిట్టబాటు ధర లేకపోవడంతో రైతులు కాస్త వెనకడుగు వేశారు. ప్రభుత్వం పత్తిపై దృష్టి సాదించి తగిన గిట్టుబాటు ధర కల్పించాలని నిశ్చయించారు. దీనితో ఈ ఏడాది జిల్లాల్లో పత్తి సాగువిస్తీర్ణం పెరిగింది.

గతంలో ఇలా...: గుంటూరు, కర్నూలు, పశ్చిమగోదావరి, నెల్లురు, కర్నూలు, కడప నుంచి పత్తి రైతులు భామిని వంటి ప్రాంతాలకు వచ్చి వందల ఎకరాల్లో కౌలుకు తీసుకొని పత్తిని పండించారు. వారే ఇక్కడి రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడి పనికిరాని భూములను సాగు భూములుగా మర్చారు. ప్రతి ఏటా వరిసాగులో నష్టాలు చవిచూసిన రైతులు మెల్లగా పత్తి వైపు మొగ్గు చూపారు. గతేడాది వ్యవసాయాధికారులు సూచనలు మేరకు చాలా మంది రైతులు పత్తిని సాగు చేసి మంచి లాభాలను పొందడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది.

పత్తి సాగు విస్తీర్ణం..ఇలా..: జిల్లాలో పత్తి పండిస్తున్న మండలాలు భామిని, సీతంపేట, కొత్తూరు, రాజాం, పొందురు, లావేరు, రేగిడి, ఆమదాలవలస తదితర మండలాల్లో ఈ పత్తి పంటపైనే రైతులు జీవనం సాగిస్తున్నారు. భామినిలో గతేడాది 1465 హెక్టార్లు పత్తిని వేసేవారు. ఈ ఏడాది 1850 హెక్టార్లు వేశారు. కొత్తూరులో గతేడాది 250 హెక్టార్లు ఉంటే ఈ ఏడాది 355 హెక్టారు వేశారు. సీతంపేటలో గతేడాది 100 హెక్టార్లు ఉండగా ఈ ఏడాది 145 హెకార్లు మాత్రమే వేశారు. రాజాంలో గతేడాది 1545 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1850 హెక్టార్లు ఉంది. రేగిడి ఆమదాలవలసలో 45 శాతం పత్తిని సాగు చేస్తున్నారు. లావేరు, పొలాకి, సరుబుజ్జిలిలో మండలాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సాగు నీటి జలవనరులు ఉన్నా...: జిల్లాలో చాలా వరకు సాగు నీటి జలవనరులు లేక వరి నుంచి పత్తి సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబర్చారు. అయితే భామిని మండలంలో మాత్రం చాలా వరకు సాగు నీటి జలవనరులు ఉన్నా వినియోగంలోకి రాకపోవడంతో వరి పండించే రైతులు పత్తి వైపు మొగ్గ చూపుతున్నారు. ప్రభుత్వం మాత్రం అన్ని సాగు నీటి జలవనరులు అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో నీరు- చెట్టు కార్యక్రమం చేపట్టింది. కానీ ఆ పనులు ఏవీ ముందుకు సాగలేదు.

గిట్టుబాటు ధర ఏదీ...: జిల్లాలో గతేడాది పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 6 వేల హెక్టార్లు మాత్రమే వేశారు. అయితే ఈ ఏడాది మాత్రం మరో అదనంగా 2 వేల హెక్టార్లు మేర సాగులో ఉందని రైతులు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో గతేడాది పత్తికి మంచి ధర లభించింది. క్వింటాకు మొదట్లో రూ.4500లకు పైగా ధర పలికింది. దిగుబడులు కూడా సగటున ఎకరాకు 10 నుంచి 12 క్వింటాలు వరకు వస్తోంది. పెట్టుబడులు మాత్రం ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.18 వేలు వరకు ఉంటోంది. గతేడాది మాత్రం ఆశించిన మేర దిగుబడులు వచ్చి మార్కెట్‌లో ధర నిలకడగా ఉండడంతో పత్తి రైతులకు కొంత ఊరటనిచ్చింది.



గోదాంలు లేక రైతు ఇంటి వద్ద నిల్వ చేసిన పత్తి (పాత చిత్రం)

ఫసల్ బీమా సౌకర్యం ఏదీ?: జిల్లాలో చాలా హెక్టార్లు విస్తీర్ణంలో సాగులో ఉన్నప్పటికి దీనికి మాత్రం ఫసల్ బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో పత్తికి ఖర్చులు సుమారు రూ.15 వేలు వరకు ఉంటుందని రైతులు అంటున్నారు. అదే విస్తీర్ణంలో భూమిని కౌలుకు తీసుకుంటే ఆ కౌలు రైతులకు ఇంకా భారంగా ఖర్చు పెరుగుతుందని చెబుతున్నారు.

దళారుల చేతుల్లో మోసం..: జిల్లాలో పత్తి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట మాత్రం చివర్లో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కాకుండా ఇష్టమెచ్చిన ధరలు నిర్ణయించి కొనుగోలుచేసుకొని వెళుతుండటంతో పత్తి రైతులు నష్టాలపాలపడుతున్నాడు. ప్రభుత్వ అధికారులు మండలాల్లోకి నేరుగా వచ్చి రైతుల దగ్గరనుంచి పత్తిని కొనుగోలు చేస్తే బాగుంటుందని రైతులు భావిస్తున్నారు. జిల్లాలో పత్తిని నిల్వ ఉంచుకునే గోదాం ఎక్కడా కనిపించడం లేదు. దీనివైపే పూర్తిగా ప్రభుత్వం దృష్టి సారించలేదు. జిల్లాలో ఒకే ఒక్క పత్తి కొనుగోలు కేంద్రం రాజాంలో మాత్రమే ఉంది. చాలా మండలాల్లో పత్తిని దళారులు తమకు నచ్చిన ధరకు విక్రయించి ఈ కోనుగోలు కేంద్రాలు రాకుండా అడ్డుపడుతున్నారు. జిల్లాలో భామిని మండలంలో పత్తి సాగు అధికంగా ఉండడంతో ఇక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. భామినిలో గతేడాది అధికారులు వచ్చి మార్కెట్‌యార్డుకు స్థల పరిశీలన చేశారు. అయితే నేటీ ఎటువంటి చర్యలు లేవు.

రైతులకు అవగాహన కల్పిస్తాం



మండలాల్లో పత్తి పండిస్తున్న రైతులకు పత్తి పైరులో ఉండే మెలకువలు, వాటికి అవసరమైన రసాయనాలు వాడకం గురించి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో అవగాహన కల్పించాం. కొంత మంది రైతులు వద్దకు వెళ్లి వాటికి సంబంధించిన ఎరువులు వాడకం గురించి తెలియజేస్తున్నాం.

- జి.మురళీకృష్ణ, వ్యవసాయాధికారి, భామిని

అంతా దళారుల చేతుల్లోకే...



వరి సాగు అనుకూలంగా లేక పత్తి సాగు వైపు మొగ్గు చూపాం. ప్రతి ఏడాది మేము దళారుల చేతుల్లో మోసపోతున్నాం. ఆరుగాలం కష్టపడ్డా ప్రతిఫలం మాత్రం దళారులు చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఇక్కడ కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మా పెట్టుబడి అయినా మాకు మిగులుతుంది.


- కొత్తకోట మధు, సొలికిరి,పత్తి రైతు

ముగ్గురు మిలీషియా సభ్యుల అరెస్టు

సిమిలిగుడ(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితిలోని పాడువా ఠాణా పోలీసులు ఆదివారం సాయంత్రం ముగ్గరు మిలీషియా సభ్యులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఠాణా అధికారి కైలాష్‌చంద్ర సెఠి తెలిపిన వివరాల ప్రకారం... హథిబాడి గ్రామ సర్పంచి జగన్నాథ కొరాను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఆగస్టు 8న హత్య చేయగా దీనిపై కేసు నమోదు చేసిన పాడువా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో పాల్గొన్న మావోయిస్టులపై ఆరా తీయగా శ్రీకాకుళం-కొరాపుట్ డివిజినల్ మావోయిస్టు కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నందపూర్ ఏరియా కమిటీతో సంబంధం ఉన్న ముగ్గరు మిలీషియా సభ్యుల వివరాలను పోలీసులు సేకరించారు. నందపూర్ ఎస్డీపీఓ శివరామ్ నాయక్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందం హథిబాడి పంచాయతీ దేవతిగుడ గ్రామానికి చెందిన విశ్వనాథ్ హంతాల్, సహదేవ్ హంతాల్, కంద్రా గ్రామానికి చెందిన జెను సీసాలను ఆదివారం అదుపులోకి తీసుకుని విచారించారు. నందపూర్ ఏరియా కమిటీలో హర్డ్‌కోర్ మిలిషియా సభ్యులుగా పనిచేస్తూ సమాచారం మావోయిస్టులకు చేరవేసి, వారికి అవసరమైన సామగ్రి అందజేస్తూ పలు విధ్వంసాల్లో పాల్గొని సహకరిస్తున్నట్లు ఆ ముగ్గురూ పోలీసుల ముందు అంగీకరించారు. దీంతో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకి తరలించారు.



అరెస్టయిన మిలీషియా సభ్యులు



తీరానికి కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహం

రణస్థలం, న్యూస్‌టుడే: దోనిపేట తీరానికి ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని యువకుని మృత దేహం కొట్టుకువచ్చింది. కందివలస గెడ్డవైపు మృతదేహం కొట్టుకు రావడంతో స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. కొట్టుకొచ్చిన వ్యక్తి వయసు 25 సంవత్సరాలుంటుంది. అతని శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని జేఆర్‌పురం పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 92; డ్రెస్డ్: 139; స్కిన్‌లెస్: 159; **వెన్‌కాబ్:** లైవ్: 93; డ్రెస్డ్: 130; స్కిన్‌లెస్: 153, **సుగుణ:** లైవ్ 90; డ్రెస్డ్: 131; స్కిన్‌లెస్: 151.

కారు ఢీకొని నలుగురికి గాయాలు

అయిదు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

అరసవల్లి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం గూడెం సమీపంలో ఆదివారం రాత్రి ఒక కారు హల్‌చల్ చేసింది. శ్రీకాకుళం నగరానికి చెందిన ఇద్దరు యువకులు ఆమదాలవలస వైపు నుంచి గూడెం వైపు కారులో వస్తుండగా.. రాగోలు సమీపంలో యు.సుహాసిని అనే యువతిని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆమె గాయాలపాలైంది. అనంతరం అక్కడ కారు ఆపకుండా గూడెం వైపు వచ్చిన యువకులు గూడెం రోడ్డులో నిలిపి ఉన్న అయిదు ద్విచక్రవాహనాలను ఢీకొట్టారు. దాంతో పాటు గూడెం వైపు నుంచి రాగోలు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న హేమలత, రాంప్రసాద్ దంపతులను ఢీకొట్టారు. వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొంచెం ముందుకువెళ్లి అక్కులు అనే వ్యక్తిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ గూడెంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారును స్థానికులు అడ్డగించి.. అందులో ఉన్న యువకులను పట్టుకున్నారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి ఆ యువకులను, కారును స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా.. ఆ యువకులు మద్యం తాగి ఉన్నారని, వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు అక్కడికక్కడే జరపాలని పోలీసులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. రెండో పట్టణ సీఐ తిరుపతిరావు వచ్చి స్థానికులతో మాట్లాడి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. నిందితులతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్‌కు కారును, ద్విచక్ర వాహనాలను తరలించారు.



చికిత్స పొందుతున్న హేమలత



ప్రమాదానికి కారణమైన కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ సరిహద్దు గ్యాస్ కంపెనీ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎ.ఎస్.పేటకు చెందిన హోటల్ యజమాని కేదారి ఉదయం ఇచ్ఛాపురం దినవారీ బజారులో సరకులను కొనుగోలు చేసుకొని తిరిగివెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ఆటోడ్రైవరు రోడ్డుపై ఉన్న గోతులను తప్పించబోయే క్రమంలో కేదారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఆ సమయంలో వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనచోదకుడు కూడా కేదారి వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికీ తలపై తీవ్ర గాయాలయ్యాయి. కేదారి కుడిచేయి విరిగిపోగా, రెండో వాహన చోదకుడు కృష్ణ వీపుపై రంధ్రం పడింది. వీరిద్దరినీ 108లో ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బ్రహ్మాపుర వైద్య కళాశాలకు తరలించారు. ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు తునాతునకలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆటో కూడా బోల్తా పడినా, అందులోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ఆటోడ్రైవరుకు గాయాలైనా, అతను పరారయ్యాడు. ఈమేరకు పట్టణ హెచ్‌సీ బి.రామారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్ఛాపురం

అంగన్‌వాడీ సేవలు మెరుగుపడాలి

జగతి (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలలో సేవలు మరింత మెరుగుపడాలని పర్యవేక్షకులు నాగలక్ష్మి అన్నారు. జగతిలో ఆదివారం కవిటి, మాణిక్యపురం సెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. దస్త్రాల నిర్వహణపై శిక్షణను ఇస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆధార్ కార్డులు అంతర్జాలంలో అనుసంధానం చేయాలన్నారు. అన్న అమృతహస్తం పథకం సమర్థవంతంగా అమలుచేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

కవిటి, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కవిటి మేజర్ పంచాయతీ సర్పంచి పి.శేఖర్ అన్నారు. కవిటిలో ఆదివారం వనం...మనంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచి శేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు నీలాచలం, నానీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠశాల ఆవరణలో యోగా తరగతుల నిర్వహణ

'ఆదర్శ' చదువులకు ఆనవాలు

ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో సమష్టిగా విధులు నిర్వహిస్తే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకున్న దురభిప్రాయం తొలగించొచ్చని సోంపేట మోడల్‌స్కూలు నిరూపిస్తోంది. చదువుతో పాటు విద్యార్థి సమగ్ర వికాసమే ధ్యేయంగా తరగతులు నిర్వహిస్తూ జిల్లాలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం గమనార్హం. ఏటా ఆరోతరగతిలో ప్రవేశం కోసం ఒక సీటుకి ఇక్కడ 12 మందికి పైగా విద్యార్థులు పోటీపడే పరిస్థితి ఉందంటే ఈ స్కూలుపై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని గుర్తించవచ్చు. మొదటియేడాది నుంచే పదోతరగతిలో శతశాతం ఫలితాలు, అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించడంతో పాటు నిర్వహణలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ముందుకుసాగుతున్న సోంపేట మోడల్ స్కూల్ గుర్తింపుపొందడానికి కారణాలు, ఇతర అంశాలపై 'న్యూస్‌టుడే'అందిస్తున్న కథనం.

● సమగ్ర వికాసం దిశగా బోధన ● ఆధునిక వసతుల కల్పన

● శతశాతం ఫలితాల సాధన

● ప్రత్యేక గుర్తింపు పొందిన సోంపేట పాఠశాల

(న్యూస్‌టుడే- సోంపేట)

సోంపేట మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనే ఏర్పాటుచేసిన మోడల్‌స్కూలు ప్రారంభం నుంచి జిల్లాలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆంగ్లమాధ్యమ తరగతుల నిర్వహణలో కార్పొరేట్ స్కూళ్లలో పనిచేసిన ఉపాధ్యాయులు ప్రారంభంలో చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. అదే పంథాను కొనసాగించడంతో గతేడాది మొదటి పదోతరగతి బ్యాచ్ శతశాతం ఫలితాలు సాధించి ప్రాధాన్యం చాటుకుంది. 10పాయింట్లు ముగ్గురు విద్యార్థులు సాధించడమే కాకుండా ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు మొదటి బ్యాచ్ నుంచి ఎంపికయ్యారు. ఇక గత విద్యాసంవత్సరం రెండో బ్యాచ్‌లో ఆరుగురు విద్యార్థులు పది పాయింట్లు సాధించగా, 12 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించుకొని రికార్డు సృష్టించారు. జిల్లాలో వివిధ సంస్థలు నిర్వహించే ప్రత్యేక పోటీల్లో సోంపేట మోడల్‌స్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయస్థానాలతో సత్తా చాటుకుంటున్నారు. ఒక్కో తరగతికి 80మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉండగా జిల్లాలోని 14 మోడల్‌స్కూళ్లలో సోంపేటను మినహాయిస్తే మిగిలినచోట్ల కొన్ని తరగతుల్లో ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ మాత్రం ప్రతీ తరగతికి పోటీ ఉండడం గమనార్హం. ఒకట్రెండు సీట్లు ఖాళీ అయితే విపరీతమైన పోటీతో పాటు వివిధ ఒత్తిళ్ల నేపథ్యంలో విధిగా పరీక్షలు పెట్టి ఆ సీట్లు భర్తీ చేయాల్సిన పరిస్థితి.



కంప్యూటర్ విద్య నేర్చుకొంటున్న విద్యార్థులు

ఆధునిక వసతులు.. ఎన్నో సదుపాయాలు

సోంపేట మోడల్‌స్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి వరకు 400 మంది విద్యార్థులు చదువుతుండగా తరగతుల నిర్వహణకు గాను 18మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రుచికరమైన మధ్యాహ్న భోజనానికి విధిగా విద్యార్థులంతా హాజరయ్యేలాచర్యలుచేపట్టారు. ప్రతీ తరగతికి ప్రత్యేక గది కేటాయించడంతో పాటు గ్రంథాలయం, కంప్యూటర్ విద్య, అనారోగ్యానికి సంబంధించి ఒక గది, ప్రయోగశాలల నిర్వహణ, వ్యాయామోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులకు వేర్వేరుగదులతో పాటు పాఠశాలప్రాంగణం కార్పొరేట్ సదుపాయాలతో అలంకరించడంతో ప్రత్యేక వాతావరణం కనిపిస్తుంది. వంద మంది బాలికల కోసం పాఠశాల పక్కనే వసతిగృహాన్ని ఏర్పాటుచేశారు. చదువుతో పాటు కంప్యూటర్ తరగతుల నిర్వహణ, యోగా, ప్రతిరోజూ క్రీడలు, రెండుపూటలా స్టడీ అవర్స్ నిర్వహణ, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు, ఏకరూప దుస్తులు, గుర్తింపుకార్డులు, కూర్చునేందుకు బల్లలు, విద్యార్థులు రెండ్రోజులు గైర్హాజరైతే తల్లిదండ్రులకు వివరణ కోరడం వంటి ప్రత్యేకఅంశాలతో తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దాతల సహకారంతో శుద్ధజలం పరికరం ఏర్పాటుతో పాటు పలు కార్యక్రమాల నిర్వహణకు సౌండ్‌సిస్టమ్, ఇతర సదుపాయాలు సమకూరాయి. వృత్తివిద్య తరగతుల బోధనలో భాగంగా యానిమేషన్, అమ్మాయిల కోసం బ్యూటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనికిగాను ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఇతర పరికరాలతో పాటు ఇద్దరు శిక్షకులను కూడా నియమించారు.

అందరి సహకారంతోనే సాధ్యం



పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు విధిగా ఆంగ్లం మాట్లాడేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో పాటు స్థానికుల సహకారంతో చక్కగా పాఠశాలను నడుపుతున్నాం. శతశాతం ఫలితాల సాధనకు గాను విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక తరగతులు, స్టడీఅవర్స్ నిర్వహణపై దృష్టి పెట్టాం. చదువుతో పాటు విద్యార్థి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలుగా యోగా, అవగాహన సదస్సులు, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆంగ్ల మాధ్యమంపై అంచెలంచెలుగా విద్యార్థులు పట్టు సాధిస్తుండడంతో భవిష్యత్తులో మరిన్ని ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.

రమాకుమారి, ప్రిన్సిపల్, మోడల్ స్కూలు, సోంపేట

విద్యార్థి దశనుంచే సేవాభావం అలవరుచుకోవాలి



ఇంటరాక్ట్ అధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ, పరోపకార గుణాలను అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ బాటలో సాగుతారని ఇచ్ఛాపురం రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.పద్మనాభం, సురేష్ పేర్కొన్నారు. శనివారం ఇచ్ఛాపురంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్ట్ క్లబ్‌లను ఏర్పాటుచేశారు. రోటరీక్లబ్‌కు అనుబంధంగా ఉంటూ, విద్యార్థులకు సేవలందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా సత్యసాయి విద్యాలయంలో ఇంటరాక్ట్ అధ్యక్షుడిగా ఎం.నాగరాజు, శాంతినికేతన్‌లో జయకృష్ణ, స్వర్ణభారతిలో కరన్, జ్ఞానభారతిలో ప్రణీతచౌదరి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాయత్రి, బాలికోన్నత పాఠశాలలో ఝాన్సీ అధ్యక్షులుగా ఎన్నికకాగా, వారితో రోటరీ అధ్యక్షులు పద్మనాభం ప్రమాణస్వీకారం చేయించారు. రోటరీ సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమంలో రొటేరియన్లు డి.కృష్ణమూర్తిరెడ్డి, ప్రఫుల్లకుమార్ పండా, డి.గోపాలరావు పాల్గొన్నారు.

యువతలో దేశభక్తిభావం పెంపొందాలి



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

శవసానపుట్టుగ (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే : యువతలో దేశభక్తిభావం పెంపొందాలని వక్తలు అన్నారు. శవసానపుట్టుగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం జాతీయ నాయకుల కొత్త విగ్రహాలను ఆవిష్కరించారు. కరాపాడుకు చెందిన డా.శేషగిరి భార్య దివంగత జ్ఞానేశ్వరి జ్ఞాపకార్థం గాంధీజీ, అబ్దుల్‌కలాం, వివేకానందుడు, సరస్వతిదేవి విగ్రహాలను డా.శేషగిరి సొంతనిధులతో నిర్మించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న యాదవ సంక్షేమసంఘం అధ్యక్షులు ఎన్.రామారావు, డా.ఎన్.దాసు, డా.ఉలాల.శేషుయాదవ్, డా.దుర్గాప్రసాద్‌పట్నాయక్‌లు డా.శేషగిరి విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి అభినందించారు. పేద విద్యార్థికి డా.శేషగిరి రూ.5వేలు నగదు అందజేశారు. నాయకులు ఎం.కొదండరావు, ఎన్.పురుషోత్తం, డి.దాలయ్య, కె.ప్రకాష్ పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యార్థులకూ ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ఎన్వీ రమణమూర్తి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) ద్వారా పట్టభద్రులైన వారు ఇతరులకు ఏమీ తీసిపోనివిధంగా విద్యావిధానాన్ని మార్పుచేసినట్లు ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపల్, డా.బీఆర్ఏఓయూ అధ్యయన కేంద్ర సమన్వయాధికారి ఎన్.వి.రమణమూర్తి అన్నారు. ఆదివారం ఇక్కడ కళాశాల ఆవరణలో అకడమిక్ కౌన్సిలర్లకు కొత్త విధానంపై అవగాహన కలిగించారు. ప్రథమసంవత్సరంలోనే విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న పాఠ్యాంశాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు వచ్చిందన్నారు. ప్రస్తుతం ఏడాదికోసారే పరీక్ష జరుగుతోందని, ఇకపై ఆర్నెళ్లకోసారి(సెమిస్టర్) పరీక్ష జరుగుతుందన్నారు. ఈ విధానంతో కోర్సులను త్వరగా పూర్తి చేయడంతో పాటు, పాఠ్యాంశాలపై లోతుగా అధ్యయనం చేసేందుకు విద్యార్థికి వెసులుబాటు వస్తుందని చెప్పారు. బి.ఎ., బీకాం, బీఎస్సీలలో చేరేందుకు ఆసక్తిగలవారు 24లోగా దరఖాస్తు చేయవచ్చునని, అభ్యర్థులు దీనిని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

సంఘటితమైతేనే విస్తృతంగా పథకాలు



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారులు

ప్రగడపుట్టుగ (కవిటి) న్యూస్‌టుడే : రైతులు వ్యక్తిగతంగా సాధించుకోలేని లక్ష్యాలు, ప్రభుత్వ పథకాలను సంఘటితంగా మాత్రమే అందుబాటులోకి తెచ్చుకోగలరని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు ఎస్.ఎ.బాలసుబ్రమణ్యం అన్నారు. ప్రగడపుట్టుగలో ఆదివారం సాయంత్రం రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం గరిష్ఠంగా రూ.2లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. మిగతా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అయ్యే ఖర్చును రైతులు భరించాల్సివుందన్నారు. దీనివల్ల ప్రతికూల సీజన్‌లో కొబ్బరి ధర నిలకడగా ఉండటమే కాకుండా కొన్ని సందర్భాలలో అధిక ధరకు అమ్ముకోవచ్చన్నారు. రైతు ప్రతినిధులు బల్లెడ కృష్ణారావు, బి.రవికుమార్, పి.శ్రీకృష్ణలు మాట్లాడుతూ జీడి రైతులకు యాజమాన్య పద్ధతులను సీజన్ వారీగా వివరించాలని సామూహిక సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి సహకరించాలన్నారు. ఉద్యానశాఖాధికారి శంకర్‌దాస్, ప్రతినిధులు ఎం.అప్పలరాజు, బి.అప్పలరాజు, బి.రాజశేఖర్, బి.వరప్రసాద్, పి.గిరిబాబు, బి.రమేష్, పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం

21 నుంచి ప్రత్యేక యోగా తరగతులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక యోగా తరగతులను నిర్వహిస్తున్నామని స్థానిక పతంజలి యోగా సమితి అధ్యక్షులు కర్రి సంజీవరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగాగురువు బాబా రామ్‌దేవ్ ప్రియశిష్యులైన బ్రహ్మచారి యోగా భానుదాసు హరిద్వార్ పతంజలి యోగా పీఠం నుంచి వచ్చారని, ఇచ్ఛాపురం ప్రాంతీయులకు యోగా సాధనపై అవగాహన కలిగిస్తారని సంజీవరెడ్డి తెలిపారు. 21వ తేదీ నుంచి 28వరకు స్థానిక పురపాలకసంఘ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం, సాయంత్రం వేళల్లో 6 గంటల నుంచి 8 గంటల వరకు తరగతి ఉంటుందన్నారు. ముఖ్యంగా బీపీ, మధుమేహం, దీర్ఘకాలిక తలనొప్పి, మోకాళ్లనొప్పి, తిమ్మిర్లు, నడుంనొప్పి, మెడనొప్పి, మూలవ్యాధి, పక్షవాతం, అధిక బరువు, జ్ఞాపకశక్తి పెంచడం వంటి అంశాలపై యోగా ద్వారా నయం చేస్తారన్నారు.

తెరపై సినిమాలు

★ ఇచ్ఛాపురం : ఎల్‌మాక్స్ సినిమా (శ్రీమణికంఠ), జయ జానకి నాయక, పూర్ణ - ఆనందోబ్రహ్మ ★ సోంపేట : శ్రీనివాస - నేనే రాజు నేనే మంత్రి, శివ - లై ★ కవిటి : మహలక్ష్మి - నేనే రాజు నేనే మంత్రి, అశోక్ - లై

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రశాంతంగా జాతీయ సార్వత్రిక పరీక్ష



లొద్దపుట్టిలో సాక్షరభారత్ పరీక్ష రాస్తున్న వయోజనులు

కవిటిగ్రామీణం, న్యూస్‌టుడే : సాక్షరభారత్ కేంద్రాల ఆధ్వర్యంలో వయోజనులకు ఆదివారం నిర్వహించిన జాతీయ సార్వత్రిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 21 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 59మంది గైర్హాజరుకాగా 961 మంది హాజరైనట్లు మండల సమన్వయకర్త జీవన్ తెలిపారు. మండల విద్యాశాఖాధికారి ధనుంజయ పలుకేంద్రాలు తనిఖీచేసి పరీక్షల తీరును పరిశీలించారు.

ఇచ్ఛాపురం,న్యూస్‌టుడే: గ్రామీణులంతా పొలం పనులలో తలమునకలైవుండగా, సాక్షరభారత్ పరీక్ష నిర్వహించడంతో చాలామంది పరీక్షకు దూరంగా ఉన్నారు. మండలవ్యాప్తంగా ప్రతీ గ్రామపంచాయతీ నుంచి 49మందిని గుర్తించి, 1,028 మంది కోసం పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాలలోని పాఠశాలలు, సాక్షరభారత్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వీటిని జరిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఏ వేళలో అయినా పరీక్ష రాసేందుకు అనుమతించడంతో మొత్తం 812 మంది పరీక్షలలో కూర్చున్నారు. గతంలో నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణత సాధించనివారు, సీ గ్రేడ్ వచ్చినవారు, బడికి వెళ్లని వారికి ఈ పరీక్షలు నిర్వహించినట్లు మండల సాక్షరభారత్ సమన్వయకర్త లింగమ్మ తెలిపారు. లొద్దపుట్ట, మండపల్లి, కొఠారి, ఈదుపురం, కేశుపురం, బూర్జపాడు, కొళిగాం, తేలుకుంచి, హరిపురం, ధర్మపురం తదితర గ్రామాలలో జరుగుతున్న పరీక్షలను ఆమె పరిశీలించారు. ఆయా గ్రామ సమన్వయకర్తలతో పాటు, ఒక ఉపాధ్యాయుడి సహకారం తీసుకుని పరీక్షలను జరిపించారు.

కంచిలి, న్యూస్‌టుడే : వయోజన విద్యలో భాగంగా మండలపరిధిలో అక్షరాస్యత సాధించిన 1028 మంది వయోజనులకు గాను పరీక్షలు నిర్వహించగా 957 మంది హాజరైనట్టు సాక్షరభారత్ మండల సమన్వయకర్త కుప్పిలి వెంకటరావు తెలియజేశారు. ఆదివారం మండలపరిధిలోని 30 పంచాయతీలలో ఈ పరీక్షలను నిర్వహించినట్టు తెలిపారు. పరీక్షలకు 844 మంది మహిళలు, 113 మంది పురుషులు హాజరయ్యారన్నారు. మండల ప్రత్యేకాధికారి కె.సత్యారావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సమన్వయకర్తలు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట మండలంలో 23 కేంద్రాలలో నిర్వహించిన జాతీయ సార్వత్రిక అక్షరాస్యత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సాక్షర్‌భారత్ కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలను ఎంపీడీవో సి.హెచ్.మల్లేశ్వరరావు, సాక్షర్‌భారత్ మండలసమన్వయకర్త ఎం.శంకరరావులు పర్యవేక్షించారు. మండలంలో 1028 మంది అభ్యాసకులకు గాను 882 మంది పరీక్షలకు హాజరయ్యారని మండల సమన్వయకర్త శంకరరావు తెలిపారు. పరీక్షలను పంచాయతీ సమన్వయకర్తలు, ఇతరసభ్యులు నిర్వహించారు. రామచంద్రపురం, పలాసపురం, బెంకిలి, జింకిభద్ర, సోంపేట పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో మల్లేశ్వరరావు తనిఖీ చేశారు.



కంచిలి: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీవో తదితరులు



ఉద్యానవనశాఖాధికారులతో కలసి మాట్లాడుతున్న ఎంపీపీ డిల్లీరావు

పండ్లతోటల అభివృద్ధికి సహకారం అవసరం

కేశుపురం (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలంలో రైతుల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడేలా పండ్లజాతి మొక్కలను విరివిగా అందివ్వాలని ఇచ్ఛాపురం ఎంపీపీ దక్కత డిల్లీరావు కోరారు. ఆదివారం కొబ్బిన్ బోర్డు ఉపసంచాలకులు అప్పారావు, టెక్కలి ఉద్యానవన సహాయసంచాలకులు బాలసుబ్రహ్మణ్యం, కవిటి ఉద్యానవనశాఖాధికారి శంకర్‌దాస్‌లు కేశుపురం గ్రామంలో పర్యటించి, రైతులకు సూచనలు చేశారు. ఇటీవలకాలంలో రైతులకు జీడి, కొబ్బరి, మామిడి జాతి మొక్కలను అందించారు. వాటి పెంపకం విషయమై రైతులకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా కేశుపురం పంచాయతీ కార్యాలయం వద్ద రైతుల తరపున ఎంపీపీ మాట్లాడుతూ, మండలవ్యాప్తంగా రైతులందరికీ పండ్లజాతి మొక్కలు అవసరమన్నారు. ఏడీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నీలాపు చంద్రయ్య, దక్కత కామేష్, బీమారావు, ఉద్యానవన శాఖ విస్తరణాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ముచ్చింద్ర (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: ప్రస్తుతం అంటువ్యాధుల కాలం కావడంతో పరిసరాల విషయంలో పూర్తి శ్రద్ధను కనబరచాలని, ప్రతీఒక్కరూ శుభ్రత పాటిస్తేనే వ్యాధులు రావని ఇచ్ఛాపురం భవానీ నర్సింగ్‌హోమ్ వైద్యులు డా.కె.గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముచ్చింద్ర గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో వైరల్ జ్వరాలు, మలేరియా జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, అందరికీ మందులను ఉచితంగా అందించారు. మొత్తం 286 మంది ఇక్కడ వైద్యసేవలు పొందారు.

రత్తకన్న యువకుడికి అగంతుకుడి టోకరా?

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురపాలకసంఘం పరిధిలోని రత్తకన్న గ్రామానికి చెందిన ఓ యువకుడిని అగంతుకుడు బ్యాంకు నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పి, అతని ఖాతాలో సొమ్మును ఖాళీ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పలుమార్లు అతని చరవాణికి ఫోన్లు వచ్చాయి. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, ఖాతా సంఖ్య, ఏటీఎం కార్డు సంఖ్యలను చెప్పాలని ఒత్తిడి తేవడంతో ఆ యువకుడు చెప్పాడని, నిముషాలలో అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.53వేలు ఖాళీ అయ్యాయని చెప్పారు. అయితే ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు చెప్పారు.

క్రీడా మైదానం... మురుగుమయం



క్రీడా మైదానంలో తిష్టవేసిన గొర్రెలు



ఆసుపత్రి వైపు క్రీడామైదానంలో నిలిచిన మురుగు

న్యూస్‌టుడే– సోంపేట:

ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో పాటు క్రీడాకారుల సాధనకు ఉపయోగపడే సోంపేట ఉన్నత పాఠశాల క్రీడామైదానం మూగజీవాలకు నిలయంగా, అధ్వాన్న పరిస్థితులకు ఆవాసంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులతో నిరంతరం రద్దీగా ఉండే ఈ క్రీడా మైదానంలో గేదెలు, మేకలు, గొర్రెలు తిష్టవేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సామాజిక ఆసుపత్రి వైపు వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్మాణ వ్యర్థాలతో నింపివేయడం, ఎగువభాగంలో ఉన్న వీధుల్లోని వారు వాడుకనీరు, మురుగునీరంతా వదిలేస్తుండడంతో అది క్రీడా మైదానంలోకి వచ్చి చేరుతుండడంతో మైదానమంతా బురదమయమవుతోంది.

ఇంకెన్నాళ్లీ బాధలు?

కవిటి, న్యూస్‌టుడే : పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది మండలకేంద్రమైన కవిటి పరిస్థితి. ముఖ్య ప్రజా ప్రతినిధుల స్వగ్రామం, అధికారులు ఉండే గ్రామం, పంచాయతీ కేంద్రం అయినా వీధులలో, రోడ్లపై రోజులతరబడి నీరు నిలిచి ఉండిపోతుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సినిమాహాల్ రోడ్డు దుస్థితి

కళాశాల విద్యతోనే ఉన్నత భవిత

సోంపేట,న్యూస్‌టుడే: కళాశాల విద్యతోనే ఉన్నతభవిత ముడిపడి వుందని, విద్యార్థులంతా ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా ఉన్నతస్థానాలను సాధించవచ్చని కృష్ణసాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ తమ్మినేని.రామారావు పేర్కొన్నారు. ఆదివారం సోంపేటలో కృష్ణసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఆహ్వాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు వ్యవహరించాల్సిన తీరు, ఇతర అంశాలపై అవగాహన కలిగించారు. డిగ్రీ విద్యార్థులు జానపద, సినీ, లలిత సంగీతం, ఇతర గీతాలకు మంచి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల డీన్ బి.ప్రకాశరావు, ప్రిన్సిపల్స్ కె.శ్రీకాంత్, జి.జయశంకర్, జె.జయప్రకాశరావు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యం

తెదేపాతోనే అందరికీ సంక్షేమ పథకాలు

మండపల్లి(కంచిలి), న్యూస్‌టుడే : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అన్నివర్గాల వారికి సమానంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కురయ్య తెలియజేశారు. మండపల్లి గ్రామానికి మంజూరైన 80 దీపం గ్యాస్ పొయ్యిలను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు ఎం.రామారావు, ఎస్.కామేశ్వరరావు, స్థానిక నాయకులు డి.దామోధరం తదితరులు పాల్గొన్నారు.



మండపల్లిలో గ్యాస్ పొయ్యిలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ కురయ్య

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

కొక్కిలిపుట్టుగ(కంచిలి), న్యూస్‌టుడే: బెంతో ఒరియా సామాజిక వర్గం సమస్యల సాధనకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని ఆ సామాజిక వర్గం నూతన కార్యవర్గం ప్రతినిధులు తెలియజేశారు. ఆదివారం పెద్ద ఆముదాలపుట్టుగ పరిధి జామి ఎలమ్మదేవాలయ ప్రాంగణంలో జిల్లా బెంతోఒరియా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శివ బిసాయి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గ సభ్యులుగా అధ్యక్షుడు భగవాన్ బిసాయి, గౌరవాధ్యక్షుడిగా చిత్రసేన్‌సాహు, మాదవ సాహు, ఉపాధ్యక్షులుగా పరశురాం బిసాయి, హరికృష్ణ బిసాయి, ప్రధాన కార్యదర్శిగా శివబిసాయి, సహాయకార్యదర్శిగా భగీరథి బిసాయి, కార్యదర్శులుగా ధనుంజయ మజ్జి, ఖెత్రోదొళాయి, భైరవి సాహు, కోశాధికారిగా మోహన్‌సాహు, సహాయ కోశాధికారిగా మాధవసాహులతో పాటు ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు. జరిగిన సమావేశంలో బెంతోఒరియా సామాజిక వర్గం సమస్యల సాధనకు కృషిచేస్తామంటూ ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో బెంతొఒరియా సామాజిక వర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బెంతోఒరియా సంఘం ప్రతినిధులు

ఈయూ ప్రాంతీయ కార్యదర్శిగా భాసూరు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈయూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రాంతీయకార్యదర్శిగా భాసూరు కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్‌నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఈయన కండక్టరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఇంతవరకు ఈయూ ప్రాంతీయఅధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

చెరకు రైతుకు తీపి...

- పెరగనున్న చక్కెర కర్మాగారం సామర్థ్యం
- ఇకపై రోజుకు 4600 మెట్రిక్ టన్నులు గానుగ
- రూ.5.5 కోట్లతో యంత్రాల కొనుగోలుకు నిర్ణయం
- మార్చి నెలతోనే గానుగ ముగించే యోచన



ప్యారీస్ కర్మాగారం

రేగిడి, న్యూస్‌టుడే : ప్యారీస్ చక్కెర కర్మాగారం గానుగ సామర్థ్యం పెంచేందుకు యాజయాన్యం నిర్ణయించింది. వచ్చే కాలానికి దన్నీ అందుబాటులోకి తేనుంది. ఇందుకు అవసరమైన యంత్రాలను తక్షణం కొనుగోలుచేసి గానుగ ప్రారంభానికి ముందే అమర్చేందుకు చర్యలు ప్రారంభించినట్లు కర్మాగారం అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో వీలైనంత వేగంగా చెరకు గానుగ ముగించేందుకు వీలుంటుందని చెబుతున్నారు. అదనంగా 400 టన్నులు చేసేందుకు యంత్రాలను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం చక్కెర కర్మాగారానికి రోజుకు 4,200 మెట్రిక్ టన్నుల చెరకును గానుగ చేసే సామర్థ్యం ఉంది. దీన్ని రోజుకు 4,600 మెట్రిక్ టన్నులకు పెంచేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అంటే రోజుకు అదనంగా 400 మెట్రిక్ టన్నులు గానుగ చేపట్టేందుకు అవకాశం ఉండేలా ఏర్పాట్లు చేయనుంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న యంత్రాలు స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు రూ. 5.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే కర్మాగారం ఉన్నతస్థాయి అధికారులు దీనిపై ఆమోదముద్ర వేయడంతో శరవేగంగా పనులు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రారంభించారు.

ఎండలు రాకముందే

ఏటా చెరకు గానుగ ఏప్రిల్ నెలాఖరు, మే మొదటి వారంలో పూర్తవుతూ వస్తుంది. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలాఖరుకు చెరకు గానుగ ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెబుతున్నారు. ఎండలకు చెరకు దొరక్కుండా సకాలంలో గానుగ పూర్తిచేయడం వల్ల రైతులకు, కర్మాగారానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 2 , 5వ తేదీ లోపునే గానుగ ప్రారంభించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. పెంపు సామర్థ్యం వల్ల ఐదు నెలల్లో కలిసి సుమారుగా 60వేల మెట్రిక్ టన్నులు అదనంగా గానుగ చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.దీంతో నెలరోజులు ముందే గానుగ ముగుస్తుందని అంటున్నారు.



చెరకు పంట

15 వేల ఎకరాల్లో చెరకు

జిల్లాలో ప్యారీస్ కర్మాగారం పరిధిలోని 15వేల ఎకరాల్లోనే చెరకు తోటలు ఉన్నాయి. ఇందులో మమ్ము చెరకు 8వేల ఎకరాలు ఉండగా ఈ ఏడాది కొత్తగా వేసిన చెరకు విస్తీర్ణం ఏడువేల ఎకరాలు ఉంది. సరాసరి 30టన్నులు దిగుబడి వేసుకుంటే 4.5లక్షల మెట్రిక్ టన్నులు గానుగ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం పెంచనున్న సామర్థ్యంతో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలలెత్తకుండా సజావుగా గానుగ సాగితే నెలకు 1.38 లక్షల మెట్రిక్ టన్నులు గానుగ చేస్తుంది. ఈ లెక్కన నాలుగు నెలలలోపే గానుగ పూర్తవుతుందని అంచనా. ప్రస్తుతం ఉన్న విస్తీర్ణం ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచాలనే యోచనలో కర్మాగారం అధికారులు ఉన్నారు. అవసరమైతే రైతులకు చెరకు నాటే నుంచి చెరకు గానుగకు తరలించేవరకు యాంత్రీకరణ అందుబాటులోకి తేవాలనే ఆలోచన యాజమాన్యం చేస్తున్నట్టు చెబుతున్నారు. చక్కెర పరిశ్రమ ప్రస్తుతం ఆశాజనకంగా ఉండడంతో సంకిలి కర్మాగారాన్ని అభివృద్ధి చేసే అవకాశాలు మెండుగా ఉన్నట్టు వివరిస్తున్నారు.

సామర్థ్యం పెంచుతున్నాం

కర్మాగారం సామర్థ్యం రోజుకు 4,600 మెట్రిక్ టన్నులకు పెంచుతున్నాం. దీంతో మార్చితోనే గానుగ ముగించాలని భావిస్తున్నాం. ఈ లక్ష్యం తప్పకుండా అమలు చేస్తాం. రైతులకు కర్మాగారం పరిధిలో అద్దె యంత్రాలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశం ఉంది. దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. రైతులకు మెరుగైన సేవలు అందజేయడమే లక్ష్యంగా కృషిచేస్తాం.

- నాగశేషారెడ్డి,కర్మాగారం ఉపాధ్యక్షుడు

సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి
- ఈనాడు కథనానికి స్పందన

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: 'పౌర సరఫరా.. నాణ్యత అరకొర' శీర్షికన శనివారం ఈనాడు మినీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కోటబొమ్మాళిలో 1, 2, 3 వార్డుల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పనితీరుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. లీలావతి ఆదివారం కోటబొమ్మాళి పివో బి. అనురాధను ఆదేశించారు. కేంద్రానికి గర్భిణులు ఎందుకు రాలేదు, బాలింతలు, పిల్లలు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంపై ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కోటబొమ్మాళి కేంద్రం కార్యకర్త లింగుబారి దుర్గ, సహాయకురాలు శ్రీలక్ష్మిలను కోటబొమ్మాళి సెక్టార్ సూపర్‌వైజర్ సారవకోట అనురాధ విచారించి వివరాలు సేకరించారు. కాగా 'న్యూస్‌టుడే' సందర్శించిన సమయంలో నలుగురు పిల్లలకు కేవలం అన్నం, గుడ్డు మాత్రమే పెట్టడం విశేషం.

ఆదిత్యుడిని దర్శించుకున్న మత్స్యశాఖ కమిషనర్

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనివెట్టి మండపంలో ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో చేపపిల్లల పెరుగుదలను చూసేందుకు వచ్చానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో జలవనరుల శాఖకు చెందిన చెరువులలో చేప పిల్లలు వృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ దయానిధి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రామశంకర్ నాయక్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు



అంపోలులో నిర్మిస్తున్న 132కేవీ సబ్‌స్టేషన్



విద్యుత్తు కష్టాలకు ఇక చెల్లు!

- రూ. 30 కోట్లతో అంపోలులో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం
- శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట మండలాలకు మేలు
- ప్రారంభమైతే నిరంతర విద్యుత్తు సరఫరా

న్యూస్‌టుడే- గుజరాతీపేట (శ్రీకాకుళం)

జిల్లాలో ముఖ్యంగా శ్రీకాకుళం నియోజకవర్గంతో పాటు ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్తు కష్టాలకు తెరపడనుంది. శ్రీకాకుళం నియోజకవర్గంలోని గార మండలం అంపోలులో రూ. 30 కోట్లతో నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు నిరంతరాయంగా కొనసాగుతూ పూర్తి కావచ్చే దశకు చేరుకుంది. దీన్ని ప్రారంభిస్తే మూడు నియోజకవర్గాల్లో విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఒడుదుడుకులు ఉండవని తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి శ్రీకాకుళం, గార మండలాల ప్రజలకు ఇటీవల కాలంలో రోజుకి కనీసం మూడు నుంచి నాలుగు గంటల కాలం విద్యుత్తు సరఫరా ఉండటం లేదు. ఒకేసారి సరఫరా నిలుపుదల కాకపోయినప్పటికీ గంటకు ఒకసారి చొప్పున సరఫరా నిలిచిపోతుండడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.



అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్

చిన్న గాలి వీచినా సరఫరా బంద్

వాతావరణంలోని మార్పుల కారణంగా చిన్నపాటి గాలి వీస్తే మూడు నియోజకవర్గాల విద్యుత్తు వినియోగదారులకు భయం! ఎందుకంటే ఏ క్షణంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందో.. మళ్లీ ఎప్పుడు ఇస్తారోననే ఆందోళన వారిది. శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని భైరి, సింగుపురం, నైరా, ఎస్.ఎస్.వలస, పెద్దపాడు, విశాఖ ఎ, బి.కాలనీలు, నగరంలోని గుజరాతీపేట, తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయేది. ఇక గార మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఆమదాలవలస, నరసన్నపేటలలోని శివారు గ్రామాలకు సైతం విద్యుత్తు నిలిచిపోయేది.

చిలకలపాలెం సబ్‌స్టేషన్‌తో అంతరాయమే

ఎచ్చెర్ల మండలం చిలకలపాలెంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి శ్రీకాకుళం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి శ్రీకాకుళం నగరానికి పొలాల్లో నుంచి విద్యుత్తు తీగలు వస్తున్నాయి. ఈ కారణంగా గాలి, వర్షం తదితర సందర్భాల్లో 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఫీడర్లు ట్రిప్ కావడం, ఏబీ స్విచ్‌లు పాడవ్వడం లేదా విద్యుత్తు స్తంభాలు పడిపోవడం తదితర కారణాల వల్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోయేది. ఈ కారణం వల్ల నగరంలోని పలు ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం గ్రామీణ, గార మండలాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం తలెత్తిన వెంటనే విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలకు సంబంధించి ఎక్కడ విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయి లేదా ఎక్కడ విద్యుత్తు స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉందో తెలుసుకోవడానికి విద్యుత్తు అధికారులు, సిబ్బందికి గంట నుంచి రెండు గంటల సమయం పట్టేది. దీన్ని చక్కదిద్ది విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడానికి మరో గంట తప్పనిసరి. మొత్తం మూడు నుంచి నాలుగు గంటల కాలం సరఫరా వచ్చేది కాదు. ఆకస్మికంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం లేదా హైఓల్టేజీతో సరఫరా పునరుద్ధరణ కావడం, తదితర కారణాల వల్ల ఇళ్లలోని విద్యుత్తు గృహోపకరణ సామగ్రి, ఇళ్లలోని విద్యుత్తు వ్యవస్థ, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోయేవి.

అంపోలు సబ్‌స్టేషన్ ప్రారంభమైతే..

అంపోలు 132 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభమైతే విద్యుత్తు సమస్యలకు తెరపడనుంది. అంపోలు నుంచి శ్రీకాకుళం ఆరు కిలోమీటర్ల దూరం అయినప్పటికీ విద్యుత్తు లైన్లు పొలాల నుంచి కాకుండా రోడ్డు పక్క నుంచి వేయడం వల్ల గాలులు, వర్షం, తదితర ప్రకృతి వైపరీత్యాల సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం తక్కువగా ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పైగా చిలకలపాలెం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వేరు చేసి.. అంపోలు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు బదలాయించడం వల్ల శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజక వర్గాల్లోని వినియోగదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

యుద్ధప్రాతిపదికన పనులు

అంపోలు వద్ద నిర్మిస్తున్న 132 కేవీ సబ్‌స్టేషన్ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. సబ్‌స్టేషన్‌కు అవసరమయ్యే భారీ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చడం ప్రారంభించారు. సబ్‌స్టేషన్ లోపల సాంకేతిక సామగ్రి ఏర్పాటు చేశారు. విద్యుత్తు తీగలు వేసే ప్రక్రియ సాగుతోంది. మరో వైపు అంపోలు నుంచి శ్రీకాకుళం వరకు విద్యుత్తు స్తంభాలు వేసే పని జరుగుతోంది.

నెలాఖరులో ఛార్జింగ్ చేస్తాం

అంపోలులో కొత్తగా నిర్మిస్తున్న 132 కేవీ సబ్‌స్టేషన్ పనులు ఎ.పి. ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణలో దాదాపు పూర్తి కావచ్చాయి. ఈ నెలాఖరున సబ్‌స్టేషన్ ఛార్జింగ్ చేసి విద్యుత్తు సరఫరా, తదితర నిర్వహణ సామర్థ్యం పనులు పరిశీలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. తరచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోకుండా నిరంతర విద్యుత్తు ఇవ్వడానికి వీలుపడుతుంది. చిలకలపాలెం సబ్‌స్టేషన్ నుంచి మూడు నియోజకవర్గాలకు సరఫరా చేసే విద్యుత్తు వ్యవస్థను కొత్తగా నిర్మిస్తున్న అంపోలు 132 సబ్‌స్టేష్‌కు మారుస్తారు. తద్వారా విద్యుత్తు వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందుతుంది.

- దత్తి సత్యనారాయణ, ఎస్.ఇ.

చేపల పెంపకానికి సాంకేతిక సాయం



చేపపిల్లల పెంపకాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్

మడ్డువలస(వంగర), న్యూస్‌టుడే : చేపల పెంపకానికి ఆధునిక పద్ధతులు , సాంకేతిక విధానాలను పాటిస్తున్నామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఆర్.రామశంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మడ్డువలస జలాశయంలోని పంజరాల్లో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పి.దుర్గారావు చేపడుతున్న చేపల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా జలాశయంలో 24 పంజరాల్లో 60 లక్షల చేపపిల్లల పెంపకం చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వాతావరణ కాలుష్యం వల్ల చేప పిల్లల ఉత్పత్తికి అధిక వ్యయం అవుతుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి , తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దూర దృశ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ మత్స్యకార సహకార సంఘ సమస్యలను మత్స్యకార సంఘం అధ్యక్షుడు దుర్గారావు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. మత్స్యకారుల అభివృద్ధికి



మడ్డువలస జలాశయంలో బోట్లపై ప్రయాణిస్తున్న మత్స్యశాఖ అధికారులు

తగిన నివేదికను పంపించాలని డీడీ కృష్ణమూర్తిని కమిషనర్ కోరారు. ఇందులో మత్స్యశాఖ ఏడీలు గోపిరెడ్డి , నిర్మాలాకుమారి ఎఫ్‌డీవోలు పాల్గొన్నారు.

మహారాజావారి స్థలాలను పరిశీలించిన కుటుంబసభ్యులు

పొందూరు, న్యూస్‌టుడే : పొందూరు మేజరు పంచాయతీలో గల మహారాజా మార్కెట్ ఆవరణను అశోక్ గజపతిరాజు కుమార్తె విజయలక్ష్మి, చెల్లెలు సునీతా ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఇక్కడ మార్కెట్‌లో మహారాజావారి స్థలాలు ఎంతమేరకు ఉన్నాయో చూశారు. ఇక్కడి స్థలాలను విక్రయించేందుకు నిర్ణయించుకున్నట్లు అశోక గజపతిరాజు పీఏ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు కుంటుంబసభ్యులు పరిశీలించేందుకు వచ్చారని తెలిపారు. కొన్ని రోజులుగా ఇక్కడి స్థలాలపై సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.



శ్రీకాకుళం నగరానికి చెందిన ఉపాధ్యాయులు పొట్నూరు నాగేశ్వరరావు, సుజాత దంపతుల కుమారుడు నిఖిల్ 2011-12 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుతుండగా ఎన్‌టీఎస్‌ఈ పరీక్ష రాసి ప్రతిభ కనబరిచారు. అప్పటి నుంచి ఇంటర్ రెండేళ్ల పాటు నెలకు రూ.1,250 చొప్పున ఉపకారవేతనం అందుకున్నారు. ప్రస్తుతం మద్రాస్ ఐఐటీలో మూడో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న నిఖిల్ నెలకు రూ.2 వేలు చొప్పున ఉపకారవేతనం అందుకుంటున్నారు.



● లావేరు మండలం బుడుమూరుకు చెందిన రైతు షణ్ముఖరావు కుమారుడు వినయ్‌కుమార్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. రెండేళ్ల కిందట 8వ తరగతిలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలో సత్తా చాటాడు. ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో ఏడాదికి రూ.6 వేలు ఉపకారవేతనం అందుకుంటున్నాడు. ఉపకారవేతనం ఇంటర్ పూర్తయ్యే వరకు అందనుంది.

మేధస్సుకు పదును పెడుతున్న ప్రతిభ పరీక్షలు

జిల్లా నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్వహించే ప్రతిభ పరీక్షలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు. జిల్లాలో ఏటా 30వేల మందికిపైగా విద్యార్థులు వివిధ రకాల ప్రతిభ పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికార వర్గాల అంచనా. పోటీ ఏదైనా.. పరీక్ష ఏ అంశంలోనైనా పాల్గొనాలి.. సత్తా చాటాలనే దిశగా విద్యార్థి లోకం ముందుకు సాగుతుండడం శుభపరిణామం.

-న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం



సత్తా చాటితే ఉపకారవేతనం మీదే!

నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్: కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్ష నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్‌ఈ). పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలో నెలకు రూ. 1,250 చొప్పున రెండేళ్లపాటు, గ్రాడ్యుయేషన్, పీజీ స్థాయిలో నెలకు రూ. 2 వేలు చొప్పున అందజేస్తుంది. దరఖాస్తు ఫీజు, చివరితేదీని త్వరలో విద్యాశాఖాధికారులు ప్రకటించనున్నారు. స్టేజ్-1 పరీక్ష ఈ ఏడాది నవంబరు 5వ తేదీన జరగనుంది. ఇక్కడ ప్రతిభ కనబరిచినవారికి వచ్చే ఏడాది మే 13వ తేదీన స్టేజ్-2 పరీక్ష నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష: కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ దేశ వ్యాప్తంగా కేవలం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పేరిట ప్రతిభ పరీక్షను జిల్లాస్థాయిలో నిర్వహిస్తోంది. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వరుసగా నాలుగేళ్లపాటు అంటే ఇంటర్మీడియట్ పూర్తయ్యేవరకు ఏడాదికి రూ. 6 వేలు చొప్పున ఉపకారవేతనం ప్రభుత్వం అందిస్తుంది. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 1. 50 లక్షలు దాటనివారు మాత్రమే అర్హులు. జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. అక్టోబరు 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు స్కాలర్‌షిప్స్ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చు.

కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సహాన్ యోజన(కేవీపీవై): కేంద్ర ప్రభుత్వానికి చెందిన కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సహాన్ యోజన(కేవీపీవై) సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన సంస్థ. పదోతరగతిలో 75శాతం మార్కులతో ఉత్తీర్ణులై ప్రస్తుతం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఇంటర్మీడియట్ తరువాత ఇంజనీరింగ్ కోర్సులకు వెళ్లకుండా కేవలం బీఎస్సీ, బీ.మేథ్స్, ఎంఎస్సీ తదితర కోర్సులు చదువుదామనుకున్నవారే ఈ పరీక్షను రాయాల్సి ఉంటుంది. జనరల్, ఓబీసీ విద్యార్థులు రూ. వెయ్యి, ఎస్సీ, ఎస్టీలు రూ. 500లు ఫీజుగా చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది నవంబరు 5వ తేదీన పరీక్ష జరుగుతుంది. ప్రతిభ పరీక్షలో సత్తా చాటి ఎంపికయితే మౌఖిక పరీక్షకు ఆహ్వానం అందుతుంది. అందులో నెగ్గితే డిగ్రీ చదివే మూడేళ్లలో నెలకు రూ. 5వేలు చొప్పున ఫెలోషిప్‌ను, కంటింజెన్సీ కింద ఏడాదికి రూ. 20వేలు అందిస్తారు. ఆ తరువాత పోస్టుగ్రాడ్యుయేషన్‌లో రెండేళ్ల పాటు నెలకు రూ. 7వేలు చొప్పున ఫెలోషిప్‌ను, కంటిజెన్సీ కింద ఏడాదికి రూ. 28వేలు అందిస్తారు. మరిన్ని వివరాలకు కేవీపీవై డాట్ ఐఐఎస్‌సీ వెబ్‌సైట్‌ను చూడవచ్చు.



ఆదివారం కేంద్రియ విద్యాలయంలో జరిగిన ప్రతిభ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రైవేటు సంస్థల పరీక్షల్లో సైతం...


● న్యూదిల్లీకు చెందిన సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్(ఎస్ఓఎఫ్) ఆధ్వర్యంలో ఒకటి నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులకు జీకే, ఇంగ్లీషు, సైన్స్, మేథ్స్, సైబర్, కంపెనీ సెక్రటరీస్ ఒలింపియాడ్ పరీక్షలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. రెండు దశల్లో జరిగే పరీక్షలు అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో జరగనున్నాయి. మరిన్ని వివరాలకు సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

గ్రామాల్లో అధికారం వీధుల్లో అంధకారం

- ఎల్‌ఈడీ దీపాల సరఫరాపై సందిగ్ధం
- ఏడాదిగా గ్రామ వీధుల్లో చిమ్మచీకట్లు
- ఇరుకున పడుతున్న గ్రామపంచాయతీలు

గ్రామపంచాయతీలకు నిధుల కొరత లేదు. అయితే గ్రామవీధుల్లో వీధిదీపాలు అమర్చుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. 14వ ఆర్థిక సంఘం నిధులు కుమ్మరిస్తున్నా ప్రజలకు అత్యంత అవసరమైన వీధి దీపాలు అమర్చలేక గ్రామ పంచాయతీలు సతమతమవుతున్నాయి. జిల్లాలోని మేజరు పంచాయతీలతోపాటు గ్రామపంచాయతీల్లో వీధి దీపాల్లేక చిమ్మచీకట్లు అలముకున్నాయి. ఏడాదిగా ఇదే పరిస్థితి నెలకొంది. సమస్య పరిష్కారానికి ఇంకెంతకాలం పడుతుందోన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.

-న్యూస్‌టుడే, బృందం



టెక్కలి ప్రధాన రహదారిలో వెలగని వీధిదీపం

● టెక్కలి మేజరు పంచాయతీలోని 92 వీధుల్లో 2,500 వీధి దీపాల్లో కేవలం 2,124 దీపాలు మాత్రమే వెలుగుతున్నాయి. ప్రధాన రహదారి, అయ్యప్ప నగర్, భవానీనగర్‌లో వీధిదీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శివారు కాలనీల్లో పరిస్థితి దయనీయంగా ఉంది.

జిల్లాలోని 13 మేజరు పంచాయతీలతోపాటు మొత్తం 1100 గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని 1,46,934 విద్యుత్తు స్తంభాలుండగా, వాటికి 1,18,142 వీధిదీపాలు అమర్చారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 14వ ఆర్థిక సంఘం నిధులతో ఎల్‌ఈడీ విద్యుత్తు దీపాలు కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం జీవో 3 ద్వారా 2016, జనవరి 18వ తేదీన ఉత్వర్వులు జారీ చేసింది. అయితే అదే అదునుగా చేసుకుని పలు గ్రామ పంచాయతీల్లో ఎల్‌ఈడీ దీపాల కొనుగోలు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డాయి. దీనిపై దుమారం రేగింది. ఇదిలా ఉండగా, నాణ్యమైన ఎల్‌ఈడీ దీపాలు తామే సరఫరా చేస్తామని కేంద్ర ప్రభుత్వం నెడ్‌క్యాప్, ఈఈఎస్ఎల్ సంస్థలకు బాధ్యతలు అప్పగించింది. విడతల వారీగా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఎల్‌ఈడీ విద్యుత్తు దీపాల సరఫరా ప్రక్రియ జరుగుతోంది. కాగా జిల్లాలో పలు మండలాల్లో ఎల్‌ఈడీ దీపాల కొనుగోలుపై అవినీతి జరిగినట్లు 'ఈనాడు'లో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వ్యాప్తంగా తదుపరి తాము తెలియజేసేంత వరకు విద్యుత్తు దీపాలు కొనుగోలు చేయొద్దని జిల్లా పంచాయతీ అధికారి రేఖా సంఖ్య 2520 ద్వారా ఈ ఏడాది మే 4వ తేదీన అన్ని మండలాలకు ఆదేశాలు జారీ చేశారు.

గ్రామపంచాయతీల్లో గడ్డుకాలం: జిల్లాలోని గ్రామపంచాయతీల్లో వీధి దీపాలకు గడ్డుకాలం ఏర్పడింది. వీధి దీపాల కొనుగోలుపై నిషేధంతో పంచాయతీలు దీపాల ఏర్పాటును గాలికొదిలేశాయి. పంచాయతీ ఖాతాల్లో పుష్కలంగా నిధులు అందుబాటులో ఉన్నా.. దీపాలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఉన్న దీపాలతోనే కాలక్షేపం చేస్తున్నాయి. ఎల్‌ఈడీ దీపాలే కాకుండా ఇతర దీపాలను కూడా ఏర్పాటు చేయలేక పంచాయతీలు చేతులెత్తేశాయి. ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా 40 శాతం వరకు వీధి దీపాలు పూర్తిగా మొరాయించగా, మరో 15 శాతం వరకు పాడైపోయి మరమ్మతులు కోరుకుంటున్నాయి.

● హిరమండలం మేజరు పంచాయతీలో 82 వీధుల్లో 375 విద్యుత్తు దీపాలు ఉన్నాయి. సుభలయ, పాత హిరమండలం, పెద్దకోరాడ, పెరిక వీధి, కోరాడ కాలనీ, మోనింగివీధి, చిన్నకోరాడ, గిరిజాల, రెల్ల, లొట్టి, గాంధీనగర్, కోరాడ కాలనీ, బ్యారేజీ సెంటర్, నౌగుడువీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడంలేదు.



నరసన్నపేటలోని పెద్దపేట సమీపంలో ప్రధాన రహదారిపై వీధిదీపం లేని విద్యుత్తు స్తంభం

ప్రభుత్వమే చర్యలు తీసుకుంటోంది: గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వమే ఎల్‌ఈడీ దీపాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు సరఫరా ఏజెన్సీల నియామకం ప్రక్రియ సాగుతోంది. త్వరలో సమస్య పరిష్కారం కానుంది. ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో ఎల్‌ఈడీ ఇతర వీధి దీపాల కొనుగోలు ప్రక్రియ నిలిపివేశాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కొత్త దీపాలు కొనుగోలు చేయవద్దని ఆదేశించాం.

–బంటుపల్లి కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

● బారువ మేజరు పంచాయతీలో 700 పైగా వీధి దీపాలు అవసరం కాగా 615 మాత్రమే సమకూర్చారు. వీటిల్లో 80 దీపాలు పనిచేయడంలేదు. వాడపాలెం, కొత్తూరు, గాంధీపేట, బీసీకాలనీ, ప్రధాన రహదారి, బారువ కూడలి నుంచి పాట్ల బజారుకు వెళ్లే మార్గం, గొల్లగండి రహదారి, బారువ సముద్రతీరానికి వెళ్లే మార్గంలో వీధిదీపాల్లేవు.



బారువ ప్రధాన వీధిలో వీధిదీపం పరిస్థితి

● సోంపేట పంచాయతీ పరిధిలో 150 వరకు వీధులుండగా 725 వీధి దీపాలు అమర్చారు. అందులో 18 మరమ్మతులకు గురవ్వగా, 80 వీధి దీపాలు కొత్తవి మార్చాల్సి ఉంది. దీంతో అత్యధిక ప్రాంతాల్లో అంధకారం నెలకొంటోంది. ● వీరఘట్టం మేజరుపంచాయతీలోని 468 వీధిదీపాల్లో 70 వరకు వీధిదీపాలు పనిచేయడంలేదు. దీంతో బీసీ కాలనీ, దిగువ, తెలగ, గొల్ల, గెంబలి, పెరుగు, లెంక వీధులు అంధకారంలో ఉన్నాయి.

● కవిటి మేజరుపంచాయతీలో 16 ప్రధాన వీధులుండగా, 160 వీధిదీపాలు ఉన్నాయి. వీటిలో 22 దీపాలు వెలగడంలేదు. బెహరా, చింతామణి కాలనీ, అగ్నికుల క్షత్రియ, పెద్ద వీధుల్లో దీపాలు వెలగకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి.

● మందస మేజరు పంచాయతీలో 33 వీధులుండగా, 168 విద్యుత్తు స్తంభాలుండగా, అధిక శాతం స్తంభాలకు దీపాల్లేవు. కొన్ని వీధుల్లో పది దీపాలకు ఒకటి, రెండు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో చాలా వీధులు చిమ్మ చీకట్లలోనే మగ్గుతున్నాయి.

● కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో 320 వరకు విద్యుత్తు దీపాలు అవసరం కాగా 280 వరకు ఏర్పాటు చేశారు. ప్రకాష్‌నగర్ కాలనీ, విద్యుత్తునగర్, రెడ్డికవీధి, జీరువీధి, 1,2,3 వార్డుల్లో పూర్తిస్థాయిలో వీధిదీపాల్లేవు.

● బత్తిలి మేజరు పంచాయతీలో 24 వీధుల్లోని. 230 స్తంభాలకు 180 దీపాలున్నాయి. బ్రాహ్మణవీధి, పైడివీధి, మాదిగ చిన్నవీధుల్లో దీపాల్లేక చీకటి రాజ్యమేలుతోంది.



కోటబొమ్మాళిలోని ప్రకాష్‌నగర్‌కాలనీలో ఇలా...

● పాతపట్నం మేజరు పంచాయతీలో 70 వీధుల్లో 1100 దీపాలుండగా, సుమారు 100కు పైగా పనిచేయడం లేదు. దీంతో ఉపాధ్యాయుల కాలనీ, ఆల్‌ఆంధ్రా రహదారి, గోపాలపురంలోని ఓ వీధి ప్రాంతాల్లో చీకట్లు అలముకున్నాయి.

● పొందూరు మేజరు పంచాయతీలో 73 వీధులుండగా, 692 విద్యుత్తు స్తంభాలకుగానూ 550 స్తంభాలకు మాత్రమే దీపాలున్నాయి. గాంధీనగర్, ఎస్సీ కాలనీ, రామ్మోహన్‌నగర్‌కాలనీ, రామ్‌భజనవీధి, మేదరవీధిలో దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది.

● నరసన్నపేట మేజర్ పంచాయతీలో మొత్తం 1,756 విద్యుత్తు దీపాలున్నాయి. శ్రీరాంనగర్ 4వ వీధి, ప్రధాన రహదారి, కాలేజీ రోడ్డు, మార్కెట్, మారుతీనగర్, వీరన్నాయుడు కాలనీ, బొరిగివలస ప్రాంతాల్లో వీధిదీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది.

ఆ ఆరుగురు.. అదరగొట్టారు!

- జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ
- రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూదిల్లీలో నిర్వహించిన ఆలిండియా ఇండిపెండెన్స్ కప్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో సీతంపేట మన్యం విద్యార్థినులు అసాధారణ ప్రతిభ చూపారు. సీతంపేట మండలం హడ్డుబంగి గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు తృతీయ స్థానం(కాంస్య పతకాలు) సాధించి జిల్లాకు పేరు తీసుకొచ్చారు. వీరికి గతేడాది నుంచి కరాటే శిక్షకుడు టి.సింహాచలం శిక్షణనిస్తున్నారు.

– న్యూస్‌టుడే, సీతంపేట



కఠోర సాధనతోనే సాధ్యం: నా పేరు మేకల దేవి. మాది రాజాం మండలం గోపాలపురం గ్రామం. తల్లిదండ్రులు పరుశమ్మ, రాజన్నదొర వ్యవసాయ కూలీలు. సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. తాము పాఠశాలలో ప్రతి రోజూ కఠోర సాధన చేయడంతోనే జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించగలిగాం. గతేడాది నుంచి తర్ఫీదు పొందుతున్నా. గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించాను. నాకు మరింత ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాను.



ఆత్మరక్షణకు ఎంచుకున్నా: నా పేరు నిమ్మక అనిత. మాది సీతంపేట మండలం తొత్తడి గ్రామం. తల్లిదండ్రులు చంద్రకళ, జగన్ వ్యవసాయ కూలీలు. సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. తమకు తాము రక్షించుకునేందుకు కరాటేలో శిక్షణ పొందాను. న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయిలో తృతీయ స్థానంతోపాటు ఇటీవల విజయగనరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకం పొందాను.



మధ్యప్రదేశ్ వారితో పోటీపడ్డాను

నా పేరు దేవుదల కుమారి. మాది హిరమండలం మండలం సుభలాయి కాలనీ. తల్లిదండ్రులు లక్ష్మి, అప్పారావు వ్యవసాయ కూలీలు. హడ్డుబంగిబాలికల ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. 9వ తరగతి చదువుతున్నప్పటి నుంచి కరాటేలో శిక్షణ పొందుతున్నాను. ప్రతిరోజూ గంట నుంచి రెండు గంటలపాటు తర్ఫీదు పొందుతున్నాను. న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మధ్యప్రదేశ్ వారితో తలపడి తృతీయ స్థానం సాధించాను.



ప్రతిరోజూ సాధన చేస్తున్నాను: నా పేరు బిడ్డిక చామంతి. మాది హిరమండలం చాపరాయి గూడ గ్రామం. హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. తల్లి దండ్రులు గంగమ్మ, సింహాచలం (తండ్రి చనిపోయారు) వ్యవసాయ కూలీలు. కరాటేలో గతేడాది నుంచి ప్రతిరోజు సాధన చేస్తూ తర్ఫీదు పొందుతున్నాను. న్యూదిల్లీలో జరిగిన జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మహారాష్ట్ర వారితో తలపడి తృతీయ స్థానం సాధించాను. హిర మండలంలో గతంలో జరిగిన పోటీలో బంగారు పతకం, విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో తృతీయ స్థానం, జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం పొందాను. 2020లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించాలన్నదే నా ధ్యేయం.





ఎదుటి వారిని కాపాడేందుకు ఉపయోగం: నా పేరు పెద్దమడి ఉషారాణి. మాది సీతంపేట గ్రామం. తల్లిదండ్రులు వరలక్ష్మి, అప్పన్న వ్యవసాయ కూలీలు. సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. ఆపదలో ఉంటే వారిని కాపాడేందుకు ఉపయోగపడుతుందని కరాటేని ఎంచుకున్నాను జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించడంతో ఒలింపిక్స్‌లో సత్తా చాటగలమనే నమ్మకం వచ్చింది.



అవతలి వారిని చూస్తే భయమేసేది: నా పేరు చింతపల్లి స్వప్న. మాది హిరమండలం మండలం జగన్నాధపురం గ్రామం. తల్లిదండ్రులు చిన్నమ్మడు, వెంకటరావు వ్యవసాయ కూలీలు. హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మాతో బరిలో దిగిన వారిని చూస్తే భయమేసింది. వారు చాలా పొడవుగా ఉండేవారు. మాతో వచ్చిన వారు ధైర్యం చెప్పారు. బరిలో దిగాకా భయం పోయింది. నేను అసోం వారితో తలపడి తృతీయ స్థానం సాధించాను. గతేడాది నుంచి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నాను. ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలన్నదే నా ధ్యేయం.

డిగ్రీ కళాశాలలు	విద్యార్థులు	ఇంజినీరింగు కళాశాలలు	విద్యార్థులు
96	46,432	6	9300

నూనుగు మీసాల ప్రాయం నిలవనీకుంది. భావితరాన్ని చూపే లక్ష్యం భారమవుతుంది. స్నేహాల పయనం గమ్మత్తుగా ఉంటుంది. చెడు వ్యసనాల సావాసం తోడు రమ్మంటుంది. నవయవ్వనపు పరిమళం విరజిల్లాలంటే తల్లిదండ్రుల ఆకాంక్షలు ఆవిరవ్వకుండా ఉండాలంటే స్వీయ భద్రతే కీలకం. ఓ వైపు ఇంజినీరింగ్ తరగతులు, మరో వైపు డిగ్రీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంకో వైపు విద్యాసంస్థల్లోనూ, యవ్వనపు వయసుల్లోనూ మత్తుతో జోగుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఉదంతాలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు త్రిముఖ వ్యూహంలో చేపట్టాల్సిన బాధ్యతలే కీలకం.

– న్యూస్‌టుడే, టెక్కలి

బంగారు బాల్యం ముగిసింది. చిలిపితనపు చివరి మజిలీ గడిచిపోయింది. కౌమార ముంగిట కుర్రకారు అడుగెట్టింది. ఇంటర్మీడియట్ అంటే తల్లిదండ్రుల భయంతోనో, ఉపన్యాసకుల ఒత్తిడితోనో అన్నింటికీ మించి కార్పొరేట్ కళాశాలల వసతి గృహాల్లో బందీలుగా మారడంతోనో, అవకాశం లేకనో సరదాలు మానుకుని కాలం గడిపేసిన కుర్రకారు ఒక్కసారి స్వేచ్ఛా యుత వాతావరణంలోకి అడుగుపెట్టాక కోర్కెల ప్రపంచం తలుపు తెరుస్తుంది. జీవిత గమనాన్ని మరిచిపోయేలా పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తెరగనివ్వకుండా చేస్తుంది. దీనికి కారణం ఇంటర్మీడియట్ వరకూ ఒత్తిడిలో మగ్గిపోవడమేనని విద్యా రంగం నిపుణులు చెబుతున్నారు. కొత్తగా స్నేహస్తం అందించే పరిచయాల ముసుగులో దారి మళ్లించే ఆలోచనలు ఒత్తిడి ముంగిట ఉన్న విద్యార్థులకు ఎంతో ఉల్లాసాన్ని, విరామాన్ని అందిస్తాయి. దీంతోనే ఉన్నత లక్ష్యాలను గాలికొదిలేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు తెచ్చుకున్న కొందరి పరిస్థితి భిన్నంగా మారుతోంది. ఏం ఉండదన్నా..ఒక్కసారి సిప్ చేస్తే కొంపలు ఏమైనా మునిగిపోతాయా వంటి మాటల వెనుక చెడు వ్యసనాలకు బానిస చేసే ప్రయాణం ప్రారంభ మవుతుందనే ఆవేశానికి పిల్లలు గురి కాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నది నిపుణుల సూచన. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహంగా మెలగాల్సిన సమయం ఇదేనని, వారిని బాధ్యతగా కనిపెట్టుకోవాల్సిన పరిస్థితిని గుర్తించి సన్మార్గంలో నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ర్యాగింగ్ విషయంలో జాగ్రత్త

జిల్లాలో ర్యాగింగ్ ప్రభావం తక్కువగానే అనిపించినా గతంలో జరిగిన ఒకట్రెండు సంఘటనలు మారుతున్న జీవన సరళిని హెచ్చరిస్తోంది. ఇటీవల కళాశాలల్లో చోటుచేసుకున్న సంఘటనలు పోలీసులను సైతం ఆందోళనను కలిగిస్తున్నాయి. ర్యాగింగ్ విషయంలో కళాశాల స్థాయిలో పోలీసులు సదస్సులు ఏర్పాటు చేసినా నియంత్రణ విషయంలో కళాశాల యాజమాన్యాల బాధ్యత కీలకం. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠినంగా యాజమాన్యాలు వ్యవహరిస్తే గానీ ర్యాగింగ్‌ను నియంత్రించడం కష్టమవుతుంది. నేటి సీనియర్లే నిన్నటి జూనియర్లు అన్న విషయాన్ని మర్చిపోతే కటకటాలపాలవ్వాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.



గమ్మత్తుగా ఉందని దరిచేరకు!

- ప్రారంభమైన డిగ్రీ, ఇంజినీరింగ్ తరగతులు
- దురలవాట్లకు దూరంగా ఉండాలని నిపుణుల సూచన



మత్తుకు బానిసైతే: గ్రామీణ ప్రాంతమే కదా జిల్లాలో ఆ పరిస్థితి ఏం ఉండదులే.. పిల్లలు చెడిపోవడానికి అవకాశమే ఉండదులే అనుకునే తల్లిదండ్రులు అప్రమత్తం కావాల్సిన అవసరం వచ్చింది. ఇప్పుడిప్పుడే జిల్లాలో మత్తులో జోగుతున్న యువత సంఖ్య పెరుగుతుందనే నివేదికలు విద్యావర్గాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గంజాయి వాడకం పెరిగిందన్న వాస్తవాలు అందిరికీ తెలిసిందే. సిగిరెట్లలో గంజాయి దట్టించి విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఆస్వాదిస్తున్నారు. మరోవైపు మందుల దుకాణంలో విరివిగా దొరికే మత్తు ఇంజెక్షన్లకు బానిసలవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులను నియంత్రించడం, కట్టడి చేయడం ఎంతో అవసరం. వారి కదలికలు కనిపెట్టకుంటే చేయిదాటిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నగర ప్రాంతాల నుంచి జిల్లాలోని కళాశాలలకు వచ్చిన విద్యార్థులు, నేపాల్, ఉత్తర భారత దేశం నుంచి వస్తున్న విద్యార్థుల నుంచి విద్యాసంస్థలకు మత్తు పదార్థాలు చేరుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



యుక్త వయసే కీలకం: యుక్త వయసు ఎంతో కీలకమైంది.. జీవితమంతా ఆనందంగా ఉండాలంటే ఈ వయసులో కొన్ని సరదాలు వదులుకోక తప్పదు. సమస్యకు మూలాలు వెతుకుతూ జీవిత గమనానికి నిర్మించే నిచ్చెనలా కళాశాలను వినియోగించుకోవాలి. ర్యాగింగ్ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాం.

– సిహెచ్. వివేకానంద, డీఎస్పీ, కాశీబుగ్గ



విశ్లేషణే వికాసం కావాలి: యుక్త వయసుకు వచ్చిన విద్యార్థులు తమకుతాము విశ్లేషించుకోవాలి దాని ద్వారానే వికాసం లభిస్తుంది. సంతోషం అంటే చెడు వ్యసనాలు కాదు, ఉల్లాసమంటే ఉత్ప్రేరకాలు కాదు. ఉద్యోగం, ఉపాధే లక్ష్యంగా పరిశోధనల వైపు దృష్టిసారిస్తే చెడు వ్యసనాలకు దూరమవుతారు. – డాక్టర్ వి.వి నాగేశ్వరరావు, డైరెక్టర్, ఐతమ్, టెక్కలి



కోరికలు అదుపు చేయకుంటే: కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు బిడ్డలకు తెలియకుండా పెంచాలనుకుంటున్న తల్లి దండ్రుల వైఖరే కోరి కష్టాలను తెచ్చిపెడుతోంది. మేము పడ్డ కష్టాలు వారు అనుభవించకూడదు అనుకునే ఆలోచనే బిడ్డలకు బాధ్యత లేకుండా చేస్తోంది. ఏమి చేసినా వారి కోసమే కదా అనే దృక్పథంతో పిల్లలు కోరినవన్నీ సమకూర్చుతుండడం వారి కోరికలకు కళ్లెం లేకుండాపోతోంది. వేగంగా దూసుకుపోయే ద్విచక్రవాహనాలు, పాశ్చాత్య పోకడను ప్రతిబింబించే ఖరీదైన దుస్తులు విద్యార్థి దశలో విద్యకు సంబంధించి అవసరాలు కాదనే ప్రాథమిక సూత్రాన్ని తల్లిదండ్రులు గుర్తెరగకపోవడంతో కొత్త సమస్యలు తెచ్చిపెడుతోంది. వేగంగా దూసుకెళ్లే వాహనాలపై తన వేగాన్ని ప్రదర్శించాలనే వయసు తన జీవితాన్ని బలితీసుకుంటుందనే ప్రమాదాన్ని గుర్తించలేకపోతోంది. మరో వైపు లైసెన్స్ లేకపోవడం, కనీస భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వారికి వాహనాన్ని సవకూర్చినవారిపై కూడా ప్రభావం చూపిస్తోంది. అమ్మాయిల విషయంలో కూడా మార్పులను, స్నేహాలను గమనించాల్సిన అవసరం ఉంది. అబ్బాయిలకు తీసుపోని విధంగా అమ్మాయిలు సైతం మత్తు పదార్థాలకు బానిసవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రతిభ

TENTH English

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us <u>from</u> many diseases.
2. A man is known <u>by</u> the company the keeps.
3. Foundation of a house lies <u>below</u> the ground level.
4. Srinidhi has no appetite <u>for</u> sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived <u>on</u> time. (Time)
2. I met Sahithi <u>at</u> the theatre. (Place)
3. Shirisha went to the market <u>for</u> fruits. (Purpose)
4. Rishita drove <u>along</u> the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor <u>till</u> he returned. (Time)
2. Naveen left Boath <u>for</u> Dubai. (Place)
3. <u>Inspite of</u> the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in <u>between</u> the two houses.
2. The moon moves <u>around</u> the Earth.
3. <u>Inside</u> the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue <u>beyond</u> the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc.

Examples:

1. The rowdy was arrested <u>according to</u> IPC 420.
2. I cannot see the film because a tall man is sitting <u>infront of</u> me.
3. Vijayendra Prasad goes to school <u>along with</u> Vamsi Krishna daily.
4. Ring the alarm bell <u>in case of</u> emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house <u>by means of</u> a broken window.
2. Shruthi attends special classes on Sundays <u>in addition to</u> regular practice.
3. We postponed our trip to Ramoji Film City <u>due to</u> bad weather.
4. <u>Inspite of</u> being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
   a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
   a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
   a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
   a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం


24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

గ్రంథాలయ స్వర్ణోత్సవాలకు కార్యాచరణ



- ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పోటీలు
- రాష్ట్రస్థాయిలో బహుమతుల ప్రదానం

న్యూస్‌టుడే, వీరఘట్టం గ్రామీణం

గ్రంథాలయ స్వర్ణోత్సవాలు, జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు జిల్లాయంత్రాంగం సమాయత్తమవుతుంది. ఈమేరకు జిల్లాలోని అన్ని గ్రంథాలయాల పరిధిలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టారు. నెలలో రెండు రోజులు ఈపోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు అన్నిగ్రంథాలయాలకు ఉత్తర్వులు విడుదలచేశారు. నవంబరు 14 నుంచి 20వతేదీ వరకు నిర్వహించనున్న గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయిలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈపోటీలకు సంబంధించి టాపిక్స్‌ను కూడా విడుదల చేశారు.

పోటీలు ఇలా నిర్వహిస్తారు: గ్రంథాలయ స్వర్ణోత్సవ పోటీలు ఈవిధంగా నిర్వహిస్తారు. 8 రకాల విషయాలపై గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు, సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు పాఠశాలస్థాయిలో మూడు స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నారు. 1. సబ్‌జూనియర్స్(4వ తరగతి నుంచి 5వ తరగతి వరకు) 2. జూనియర్స్ (6వ తరగతి నుంచి 7వ తరగతి వరకు) 3. సీనియర్లు (8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు) చదువుతున్న విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. నెలలో మొదటి, మూడో గురువారాల్లో ఆఖరి రెండు పీరియడ్లలో ఈపోటీలు నిర్వహించాలి. గ్రంథాలయ కార్యక్రమాలను ఇన్‌ఛార్జి ఉపాధ్యాయునితోపాటు భాషాపండితులు ప్రోగామ్ ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించాలి.

- సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు, భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, చిత్రలేఖనం ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకులు, ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు వివిధ రకాలైన పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా టాబ్లెట్ పీసీలు బహుమతి ప్రదానంచేయనున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ (ఎక్కువ పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్న)పాఠశాలలకు ప్రథమ బహుమతి క్రింద రూ.50వేలు, ద్వితీయబహుమతి క్రింద రూ.25వేలు, తృతీయ బహుమతి క్రింద రూ.10వేలు విలువచేసిన పుస్తకాలు అందజేస్తారు.

కార్యాచరణ ప్రారంభిస్తాం

జాతీయ గ్రంథాలయవారోత్సవాలతోపాటు గ్రంథాలయ స్వర్ణోత్సవాలు నవంబరు నెలలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర సంచాలకుల ఆదేశాలమేరకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివిధస్థాయిల్లో పోటీలు నిర్వహిస్తాం. రాష్ట్రస్థాయిలో విజేతలైనవారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావులు చేతులమీదుగా లాప్‌ట్యాబ్‌లు అందుతాయి. రాష్ట్రస్థాయిలో ఎక్కువమంది విద్యార్థులు ఎక్కువ పోటీల్లో పాల్గొన్న పాఠశాలలకు కూడా బహుమతులు క్రింద విలువైన పుస్తకాలు అందజేస్తారు.

-సత్యనారాయణ, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, శ్రీకాకుళం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులు (దాచిన చిత్రం)



నిరసన వ్యక్తం చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

జీడీఎస్ ఉద్యోగుల నిరసన

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: తపాలాశాఖలో తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగుతున్న గ్రామీణ డాక్ సేవక్‌లు (జీడీఎస్‌లు) తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత కొద్దిరోజులుగా విధులను బహిష్కరిస్తున్నట్లు తపాలా జీడీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో జీడీఎస్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ జిల్లాలో 569 మంది జీడీఎస్ ఉద్యోగులు ఉన్నారని.. వారికి అందుతున్న వేతనాలు, సౌకర్యాలు అంతంతమాత్రమేనని చెప్పారు. జీడీఎస్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.సోమేశ్వరరావు, ఎస్.త్రినాథరావు, ఎ.ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు రాజీవ్‌గాంధీ కృషి

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రాజీవ్ గాంధీ దేశ సమగ్రతకు తీవ్రంగా కృషిచేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డోల జగన్ పేర్కొన్నారు. ఆదివారం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి డోల జగన్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో శాస్త్రసాంకేతిక రంగాలకు రాజీవ్ గాంధీ పెద్దపీట వేశారని.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డ అని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి రత్నాల నర్సింహమూర్తి, డీసీసీ నాయకులు డీఎస్‌కే ప్రసాద్, పుట్టా అంజనీకుమార్, మామిడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గేట్లు ఎత్తివేయడంతో గొట్టాబ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

నేటి నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ ఉచిత స్మార్ట్ సిమ్‌లు

అరసవల్లి, న్యూస్‌టుడే: బీఎస్‌ఎన్‌ఎల్ ఉచిత మొబైల్ స్మార్ట్ సిమ్ సౌకర్యం ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కల్పిస్తున్నట్లు డీజీఎం పి.మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్, ల్యాండ్ లైన్, బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు జిల్లాలోని ముఖ్యకేంద్రాలలో నాలుగు రోజుల పాటు మేళాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వంశధారలో 11వేల క్యూసెక్కులు

16గేట్లు ఎత్తివేసి దిగువకు నీరు విడుదల

హిరమండలం, న్యూస్‌టుడే: వంశధార నదిలో ఆదివారం స్వల్పస్థాయిలో నీటి ప్రవాహం పెరిగింది. నది క్యాచ్‌మెంట్ ఏరియా ఒడిశాలో వర్షపాతం నమోదు కావడంతో గొట్టాబ్యారేజి వద్ద 11వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా నమోదైంది. వచ్చిన నీటిలో 200క్యూసెక్కులు కుడికాలువకు, 1000 క్యూసెక్కులు ఎడమ కాలువకు విడిచిపెట్టారు. 16గేట్లు ఎత్తివేసి 9800క్యూసెక్కులు దిగువకు విడిచిపెడుతున్నట్లు డీఈఈ ఎం.ప్రభాకర్ తెలిపారు

ప్రశాంతంగా ఎన్ఐఓఎస్ పరీక్ష

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 39,057 మంది హాజరు కావాల్సి ఉండగా 31,153 మంది (79.76 శాతం) హాజరైనట్లు వయోజన విద్య ఉప సంచాలకులు జి.కృష్ణారావు తెలిపారు. జిల్లాలోని 1099 గ్రామ పంచాయతీల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. శ్రీకాకుళం మండలం తండేంవలసలోని పరీక్ష కేంద్రాన్ని వయోజన విద్య ఉప సంచాలకులు జి.కృష్ణారావు తనిఖీ చేశారు.

హోరాహోరీగా 'గిరి ఒలింపిక్స్' పోటీలు

సీతంపేట, న్యూస్‌టుడే: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా గిరి ఒలింపిక్స్ క్రీడలు ఆదివారం ప్రారంభమయ్యాయి. క్లస్టర్‌ల స్థాయిలో సీతంపేట, మెళియాపుట్టి, మందసలలో ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్‌బ్యాట్మింటన్, అథ్లెటిక్స్, తదితర పోటీలు 6, 7 తరగతుల వారికి జూనియర్ విభాగంగా, 8, 9, 10 తరగతుల వారికి సీనియర్ విభాగంగా పరిగణించి పోటీలు నిర్వహించారు. సీతంపేట క్లస్టరు పరిధిలో 27 గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ, ఇతర పాఠశాలల నుంచి సుమారు 855 మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. బాలికలకు బాలికల ఆశ్రమ పాఠశాలలో, బాలురకు ఉన్నత పాఠశాల వద్ద పోటీలు జరిపారు. హోరాహోరీగా పోటీలు సాగాయి. సీతంపేట క్లస్టర్‌లో జరిగిన పోటీలను ఆదివారం ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టరు స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

పొందిన వారికి జిల్లా స్థాయిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో విజయం సాధించిన వారికి క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. గిరిజన యువతకు సైతం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, విలువిద్య, అథ్లెటిక్సు విభాగాల్లో ఈనెల 26, 27 తేదీల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గున్ను రామ్మోహనరావు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో నరేష్‌కుమార్, సీతంపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండగొర్రి సుబ్బారావు, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవాచారి, ఎస్.మల్లిక, వి.ఏ.భాస్కర్, వెంకటరమణ, వెంకటరావు, కరాటే శిక్షకుడు సింహాచలం, ఉపాధ్యాయురాలు రాములమ్మ, తదితరులు ఉన్నారు.

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!


- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద

సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐ ☐	5. Pay	వే ☐ ☐
2. Flute	వే ☐ ☐	6. God	వే ☐ ☐
3. Speed	వే ☐ ☐	7. Function	వే ☐ ☐
4. Heat	వే ☐ ☐	8. Dawn	వే ☐ ☐

- డీ దయామతి, హన్మకొండ



దారేది?

చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడి పొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చిన్నూ కబుర్లు



చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!


- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధ పడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ



యువకుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

జల సమాధి!

(మొదటిపేజీ తరువాయి)

సమీపంలో కాలువలోకి దిగారు. కాలువలో నాచు ఎక్కువగా ఉండడం, బురదమయంగా ఉండడంతో ఇద్దరు కాలువలోకి జారిపోయారు. ఆ సమయంలో కాలువ గట్టుపై ద్విచక్ర వాహనంపై ఉన్న అభిలాష్‌నాయుడు కేకలు వేశాడు. సమీపంలో ఉన్న పోరాం గ్రామస్థులు ఘటనాస్థలానికి వచ్చారు. కాలువలో ప్రవాహం ఎక్కువగా ఉండడం.. రోహిత్‌నాయుడు, రామరాజులకు ఈత రాకపోవడంతో.. ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. కొంత దూరంలో ఇద్దరు యువకుల మృతదేహాల్ని కనుగొన్నారు.

మొన్న తండ్రి.. ఇప్పుడు కుమారుడు

రామరాజు తండ్రి తమ్మినాయుడు సంతకవిటి మండలం ఉపాధ్యాయ వర్గాల్లో తలలో నాలుకలా ఉండేవారు. ఉపాధ్యాయుడిగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు రామరాజు ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి మృతితో ఆ ఉద్యోగం రామరాజుకు కారుణ్య నియమాకం కింద రావాల్సి ఉంది. తండ్రి మృతి చెందే నాటికి కుమారుడు మేజర్ కాకపోవడంతో డిగ్రీ తరువాత ఉద్యోగంలో చేరేందుకు సన్నద్ధమయ్యాడు. ప్రస్తుతం డిగ్రీ (బీఎస్సీ) రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇంతలోనే ఆదివారం ఘోరం జరిగిపోయింది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి సౌధామణి రోదనలకు అంతు లేకుండా పోయింది. ఆమె కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇటీవల తండ్రి, ఇప్పుడు కుమారుడు మృతి చెందడంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు.

నేడు కళాశాలకు వెళ్లాల్సిఉండగా..

రోహిత్‌నాయుడు ఇటీవలే శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం పొందాడు. సోమవారం నుంచి కళాశాలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. ఇందుకు పుస్తకాలన్నీ సర్దుకున్నాడు. ఇంతలోనే మృత్యువు కబళించింది. ఇతని తండ్రి రాజశేఖర్ సంతకవిటి పోలీస్ స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి సావిత్రి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రోహిత్ మృతితో వీరు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. రేగిడి ఎస్సై భాస్కరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కోడిశ ఎంపీటీసీ సభ్యుడు పెంటన్నాయుడు, తదితరులు సహాయక చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న వంశధార జలాశయం పనులు

హిరమండలం, న్యూస్‌టుడే : వంశధార జలాశయం పనులు కొనసాగుతున్నాయి. వంశధార ఇంజినీర్ల పర్యవేక్షణలో ఆదివారం గార్లపాడు, చిన్నకొల్లివలస రహదారి వద్ద గట్టు పనులను యంత్రాలతో చేపట్టారు. స్పిల్‌వే, లింక్ కాలువ పనులు కొనసాగుతున్నాయి. ఆర్డీవో గున్నయ్య, తహసీల్దారు కాళీప్రసాద్‌లు గొట్టా బ్యారేజి సెంటర్ వంశధార నిర్వాసితులకు పునరావాస స్థలాలు అప్పగించేందుకు లబ్ధిదారుల ఎంపిక తుది జాబితా కోసం తహసీల్దారు కార్యాలయంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. దుగ్గుపురం, పాడలి, తులగాం గ్రామాల వైపు పొలంగట్లు, పంట పొలాలు తొలగింపు పనులు అధికారులు నిలిపివేశారు. ఈప్రాంతంలో మట్టి తవ్వకాలకు అవసరమైన భూమిని దాదాపు 430ఎకరాలు సిద్ధం చేశారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. వర్షాలు తగ్గితే ఈ భూముల్లో మట్ట తవ్వకాలు చేపట్టనున్నారు. నంద్యాల ఎన్నికల శాంతిభద్రతల పర్యవేక్షణకు కొంతమంది పోలీసులను తరలించడంతో ఇక్కడ బలగాల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. అవసరమైతే ప్రత్యేక పోలీసు బలగాలు రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ వి.సుబ్రహ్మణ్యం, పాతపట్నం సీఐ బీఎస్ఎస్ ప్రకాష్‌లు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.



గార్లపాడు, చిన్నకొల్లివలస రహదారి వద్ద చేపట్టిన వంశధార జలాశయం గట్టు పనులు

నాలుగు రోజులు.. మూడు జాబితాలు!

(మొదటిపేజీ తరువాయి)

చూపించారు.

రెండో జాబితాలో మరో ముగ్గురు

రెండో జాబితాలో మొత్తం 77 మంది ఉన్నారు. అంటే.. మొదటి జాబితా కంటే ఇందులో ముగ్గురు అధికం. ఎలా మార్పు చేశారో.. ఎందుకు మార్పు చేశారో ఎవరికీ అంతు పట్టడం లేదు. జాబితా రూపొందించిన కీలక అధికారులకు సంబంధించిన అభ్యర్థుల కోసమే ఆ మార్పు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

రెండు రోజుల్లో 120కి పెంపు!

మరో రెండు రోజులు గడిచాక జాబితా ఏకంగా 120 మందికి పెరిగింది. అంటే 43 మంది పెరిగారన్నమాట. ఆ మేరకు పోస్టులు లేవు. అయినా జాబితా పెరిగిపోయింది. ఆ మేరకు ఉద్యోగాల సంఖ్య పెంపునకు అనుమతి ఉందా.. అంటే లేదు. మరెలా పెరిగింది? మెరిట్ జాబితాలో మతలబులే ఆ పెంపుదలకు కారణం.

దస్త్రం రూపొందించాల్సిందిలా..

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్‌కు సంబంధించిన గుమస్తా.. సూపరింటెండెంట్లు ఇరువురూ ఈ దస్త్రాన్ని రూపొందించాలి. ఆ సూపరింటెండెంటును ఈ దస్త్రం రూపొందించే బాధ్యతల నుంచి తప్పించి మరో జనరల్ సెక్షన్ సూపరింటెండెంటుకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. మూడు నాలుగు నెలలు తన వద్దే దస్త్రాన్ని ఉంచుకుని తయారు చేసినట్లు భావిస్తున్నారు. నియామకాల దస్త్రాలను నడిపించడంలో సిద్ధహస్తుడిగా ఆయనకు ఉన్నత స్థాయి అధికారులు ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. వాస్తవానికి గత నియామకాలన్నీ గబ్బు పట్టడానికి ఈ అధికారే ప్రధాన సూత్రధారి అన్న అనుమానాలు ఉన్నాయి. గతంలో 2007-08లో చేపట్టిన రెండో ఏఎన్ఎం (ఆర్సీహెచ్-2) నియామకాల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఉన్నతస్థాయి అధికారులు నమ్మకంతో.. మెరిట్ జాబితా రూపకల్పన బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించారు. ఆ జాబితాపై ఆమోద ముద్ర పడగానే.. సదరు అధికారి పథకం ప్రకారం వ్యవహారం నడిపించేవారు. ఇందుకో ప్రత్యేక ముఠా (గ్యాంగ్) ఉంది. మండలాల వారీగా కూడా ఆ ముఠాలను రంగంలోకి దింపారు. 'నీకు ఉద్యోగం వేయిస్తాం. రూ.లక్ష ఇస్తే చాలు' అంటూ బేరం పెట్టారు. అప్పట్లో 478 పోస్టులకు దాదాపు రూ. 5 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది జిల్లాలో పెనుదుమారం రేపింది. ఇంతకు ముందు కలెక్టర్ లక్ష్మీనృసింహం హయాంలో కూడా వైద్యాధికారి నియామకాల్లో సదరు సూపరింటెండెంటు తీరుపై అసహనం వ్యక్తం చేసి.. ప్రభుత్వానికి సరెండర్ చేయాల్సిందిగా కూడా ఆదేశించారు. ఆ సమయంలో ఆ అధికారిని వెనకేసుకొచ్చిన జిల్లా వైద్యాధికారిని కూడా సెలవులో వెళ్లాలని హెచ్చరించారు. చివరికి సదరు సూపరిండెంటెంటు ఆర్నెళ్లు సెలవుపై వెళ్లారు.

గత హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లోనూ..

అదే సమయంలో నిర్వహించిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లోనూ అదే అధికారి సూత్రధారిగా వ్యవహరించినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. 2006లో 110 హెల్త్ అసిస్టెంటు ఉద్యోగాల నియామకాల్లో చోటుచేసుకున్న తప్పులతడకల వ్యవహారంలోనూ ఆయనే కీలకం. అప్పట్లో ఎక్కువ మార్కులు వచ్చిన స్థానికులను స్థానికేతరులుగా చూపించి.. తక్కువ మార్కులు వచ్చిన వారికి పోస్టింగులు ఇప్పించడంలో కీలక భూమిక పోషించారు. అప్పట్లో ఆయన సీనియర్ అసిస్టెంటు. తనకు సంబంధం లేకపోయినా తెరవెనక ఉండి కథ నడిపించారు.

ఏ జాబితా వెనక ఏముంది..

తాజా ఆరోగ్య కార్యకర్తల ఉద్యోగాల అర్హత జాబితా రూపకల్పన బాధ్యతలను ముగ్గురి భుజస్కంధాలపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఉంచారు. వారిని ఆయన గుడ్డిగా నమ్మడమే ఈ అనర్థాలకు మూలమని భావిస్తున్నారు. ఆ ముగ్గురిలో ఒకరు జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖలో దశాబ్దానికి పైగా జిల్లాస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి ఒకరు. మరొకరు సూపరింటెండెంటు. ఇంకొకరు సీనియర్ అసిస్టెంటు. ఈ ముగ్గురిలో జిల్లా స్థాయి అధికారి తనకు సంబంధించిన ఇరువురు అభ్యర్థులను అర్హులుగా ఎంపిక చేసేందుకు వీలుగా.. స్థానికులపై స్థానికేతర ముద్ర వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండో జాబితాలో సీనియర్ అసిస్టెంటు తనకు సంబంధించిన ముగ్గురిని చేర్చినట్లు సమాచారం. డీ మెరిట్‌లో ఉన్నవారిని కూడా అర్హుల జాబితాలో చేర్చేందుకు వీలుగా మూడో జాబితాను పెంచేసినట్లు భావిస్తున్నారు.

స్థానికతను పరిశీలిస్తేనే న్యాయం

అభ్యర్థుల స్థానికత విజ్ఞాపనను పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం 2017 మే 23న విస్పష్ట ఆదేశాలు ఇచ్చింది. వారు చూపిస్తున్న అర్హతలను పరిశీలించాల్సిందిగా సూచించింది. తదుపరి కోర్టు వ్యాజ్యాలు లేకుండా సమస్యను జాగరూకతతో పరిష్కరించాలని కూడా ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ దిశగా జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి పరిశీలించాల్సిన అవసరం ఉంది. అభ్యర్థుల్లో ఎవరు స్థానికులో గుర్తించాలి. స్థానికులను స్థానికేతరులుగా ముద్ర వేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలి. అసలు అలా ఎందుకు చేస్తున్నారో గుర్తిస్తే తప్ప సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కాదు. ఆ దిశగా కలెక్టర్ న్యాయం చేయాలని అభ్యర్థులు అర్థిస్తున్నారు.

యాంత్రీ'కరుణ' ఏదీ?!

(మొదటిపేజీ తరువాయి)

సమకూరితే పంట పెట్టుబడులు తగ్గేవి. ఇతర రైతుల దమ్ములు సైతం చేపడితే ట్రాక్టరు కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణం కొంత తీరేది. రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వచ్చినా పథకం ముందుకు సాగలేదు.

ఎస్ఎంఏఎం ఇంతే..

సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మిషనరి (ఎస్ఎంఏఎం) కింద ప్రభుత్వం రూ. 8.75 కోట్లు కేటాయించింది. దీని ద్వారా మినీ ట్రాక్టర్లు మంజూరు చేసుకొనే వీలుంది. 24 హెచ్‌పీ సామర్థ్యం కన్నా తక్కువ ఉన్న ట్రాక్టర్లు ఈ పథకం కింద మంజూరు చేస్తారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. లక్ష వరకు రాయితీ సమకూర్చే వీలుంది. స్ప్రేయర్లు, రోటోవేటర్లు, వరికోత యంత్రాలు, పవర్ టిల్లర్లు, పవర్ స్ప్రేయర్లు, తదితరాలను అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్క రైతుకు వీటిని అందించలేక పోయారు.

రాష్ట్రీయ కృషి విజ్ఞాన్..

రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన (ఆర్‌కేవీవై) కింద ప్రభుత్వం రూ. 10.75 కోట్ల వరకు కేటాయిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చింది. ఈ మేరకు ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగితే రైతులకు భారీ వరికోత యంత్రాలు, బ్లేడ్లు సమకూరేవి. కస్టమర్ హైరింగ్ కేంద్రాలు (సీహెచ్‌సీలు) కింద యంత్రాలు సమకూర్చుతారు. నలుగురు రైతులు సంఘంగా ఏర్పడితే ఫాం మిషనరీ బ్యాంకుల కింద రూ. 8 లక్షల వరకు రాయితీ మంజూరు చేసే వీలుంటుంది. మూడు పథకాల నుంచి ఒక్క యంత్రం కూడా రైతులకు ఇంత వరకు అందలేదు.

దరఖాస్తుల స్వీకరణలోనూ జాప్యమే

వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణలోనూ జాప్యం జరిగింది. పూర్తి పారదర్శకత కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఇలా వచ్చిన దరఖాస్తులను మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, సంయుక్త సంచాలకులకు వరుసగా చేరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం మేరకు రైతులకు యూనిట్లు మంజూరు చేసేలా నిబంధనలు రూపొందించారు. ఆరు రోజుల క్రితం వరకు దరఖాస్తులు చేసుకోవడానికి సైతం అవకాశం లేకుండా పోయింది. గడిచిన అయిదు రోజులుగా రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయి చేతికి యంత్రాలు అందేసరికి పుణ్యకాలం కాస్త గడిచిపోతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

యాంత్రీకరణ పథకాల్లో యంత్రాల కోసం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీటి మంజూరులో కొంచెం జాప్యం జరిగిన మాట వాస్తవమే. అయిదు రోజుల క్రితం నుంచి రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎస్‌డీపీ, ఎస్ఎంఏఎం పథకాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినా ఆర్‌కేవీవైపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించాం. యాంత్రీకరణ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకుంటే పంట దిగుబడులు పెరగడమే కాదు.. సాగు పెట్టుబడులు బాగా తగ్గే అవకాశముంది. రైతు రథం కింద ట్రాక్టర్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీపడుతున్నాయి.

–జి.రామారావు, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు, శ్రీకాకుళం

కనీస ప్రమాణాలూ కరవు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాల గురించి తేటతెల్లం చేసింది. ఈ సంస్థ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యాప్రమాణాల మీద గడిచిన కొన్ని సంవత్సరాలుగా సర్వే చేస్తూ నివేదికలు విడుదల చేస్తోంది. అందులో భాగంగా గత విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలో సుమారు 29 మండలాల్లోని 300 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు ఆరువేల మంది విద్యార్థులపై సర్వే నిర్వహించారు. సర్వేలో వెల్లడైన వివరాలను ప్రథమ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

2015లో సర్వే నిర్వహించలేదు. గతేడాది ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను కూడా సర్వేలో చేర్చారు. అంతకు ముందు సంవత్సరాల్లో కేవలం అయిదో తరగతి వరకు గల విద్యార్థులపైనే సర్వే చేసేవారు.

జిల్లాలో గత కొన్నేళ్లలో నిర్వహించిన సర్వేల ఆధారంగా రూపొందించిన నివేదికల సారాంశం (గణాంకాలన్నీ శాతాల్లో)

సంవత్సరం	మూడు నుంచి అయిదో తరగతి విద్యార్థులు: ఒకటో తరగతి పుస్తకం చదవలేక పోతున్నవారు	మూడు నుంచి అయిదో తరగతి విద్యార్థులు: నామమాత్ర తీసివేతలు చేయలేక పోతున్నవారు	ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు: రెండో తరగతి పాఠ్య పుస్తకాన్ని చదవలేక పోతున్నవారు	ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులు: నామమాత్ర భాగహారాలు చేయలేకపోతున్నవారు
2016	25.7	32.4	21.4	48.8
2014	40.6	42.3	-	-
2013	20.6	30.0	-	-
2012	30.2	34.1	-	-

రూ.3 కోట్లతో..

పర్యటక అభివృద్ధికి ఏటా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటుంది. ఏడాదికి రూ.2 కోట్లు వరకు సమకూరతాయి. ఈఏడాది రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులన్నీ తీర ప్రాంతంలోని బీచ్‌ల అభివృద్ధికి కేటాయిస్తే ప్రయోజనంగా ఉంటుందని సందర్శకులు అంటున్నారు. అయితే సీతంపేటలో ఆర్ట్ గ్యాలరీ, పొందూరులో ఖాదీ నమూనా విలేజ్‌ల ఏర్పాటుకు రూ.2 కోట్లు కేటాయించి మిగిలిన రూ. కోటితో బీచ్‌లు అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. ముందుగా ప్రతీ బీచ్‌లో 40 వరకు బల్లలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రైవేటు రంగానికి పర్యటకంలో ప్రోత్సహిస్తుండడంతో ప్రభుత్వ నిధులు పెద్దగా ఖర్చు చేయడానికి సాహించడం లేదన్న వాదన వినబడుతోంది.

ప్రముఖ దేవాలయాలు..

ప్రపంచంలోనే గుర్తింపు పొందిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంతోపాటు శ్రీకూర్మం, శ్రీముఖలింగం, గార బౌద్ధక్షేత్రం, శ్రీకాకుళం ఉమారుద్రకోటేశ్వరాలయం వంటి వాటిని సందర్శించుకోవడానికి ఏటా భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తున్నారు. సాధారణంగా పర్యాటక రంగం అభివృద్ధి పుణ్యక్షేత్రాలు, తీర ప్రాంతం అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. ఈ రెండు రంగాలు అభివృద్ధి చెందితే ఆప్రాంతానికి తిరుగుండదు.

అపార మత్స్య సంపద

సాగరంలో అపార మత్స్య సంపద ఏటా ఉత్పత్తి అవుతోంది. ఏటా రూ.వందల కోట్లు జిల్లాకు సమకూరుతున్నాయి. బీచ్‌ల అభివృద్ధితో జట్టీలువంటివి ఏర్పాటైతే మత్స్య సంపద ఎగుమతికి బాగుంటుంది. విదేశాలకు తరలించే అవకాశం ఏర్పడుతుంది.

ఇవీ బీచ్‌లు : ● కళింగపట్నం ● శివసాగరం ● బారువ ● భావనపాడు ● అక్కుపల్లి



జట్టీలతో అభివృద్ధి

గోవా అభివృద్ధిలో..పర్యటక రంగమే కీలకంగా మారింది. జిల్లాలో సాగర తీరం అధికంగా ఉండడంతో పాటు బీచ్‌లకు కొదవలేదు. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ పర్యటకలను ఆకర్షించే రీతితో తీర్చిదిద్దితే జిల్లా దశ దిశ మారిపోతుంది. విశాఖపట్టణం వరకు సందర్శకులు అధికంగా వస్తుంటారు. దేశంలోనే విశాఖపట్నంకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంత వరకు వచ్చిన సందర్శకులు జిల్లాకు రావాలంటే పర్యటక రంగం అభివృద్ధి సాధించి తీరాల్సిందే. 11 మండలాల్లోనూ తీర ప్రాంతం అభివృద్ధి చేసే వీలుంది. ప్రకృతి అందాలు ప్రపంచానికి చూపించే స్థాయి వసతులు ఇక్కడ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలకూ ఢోకా ఉండదు. ప్రభుత్వం 'సాగరమాల' పథకంలో భాగంగా జిల్లాలో జట్టీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. రూ.50-70 కోట్లు మధ్య దీనికి ఖర్చవుతుంది. జట్టీలు ఏర్పాటు చేస్తే క్రూయిజ్ ఓడలు నిలుపుకొనే వీలుంటుంది. ఇది పర్యాటకులు సముద్రమార్గంలో జిల్లాకు వచ్చే వీలు కల్పిస్తుంది. కళింగపట్నంలో దీన్ని ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సూత్రప్రాయ అంగీకారం కుదిరినా తరువాత ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

తనివితీరం చూట్టేద్దాం



బారువలోని అతిథి గృహాలు

● నిర్వహణ బాధ్యత మహిళలకు

బీచ్‌లను అభివృద్ధి చేసి నిర్వహణ బాధ్యత మహిళలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వ నిధులతో కనీస వసతులు ఏర్పాటు చేసి స్వయంశక్తి సంఘాల మహిళలకు నిర్వహణ బాధ్యత అప్పగిస్తారు. ఉచితంగానే వారికి ఇస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. తీరం అభివృద్ధి చెందుతుందని, ఆదాయం బట్టి చిన్న చిన్న వసతులు వారే ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఈమేరకు ఇప్పటికే దీనిపై సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చారు.

న్యూస్‌టుడే , రాజాం

రణస్థలం మండలం ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకు 193 కిలోమీటర్లు మేర సాగర తీరం విస్తరించి ఉంది. 11 మండలాల పరిధిలో సువిశాల సముద్ర తీరం జిల్లాకే వరం. రాష్ట్రంలోనే అత్యధిక తీర ప్రాంతమున్న జిల్లాగా ప్రత్యేక గుర్తింపు ఉంది. కాని ఆ స్థాయిలో తీర ప్రాంతం అభివృద్ధి చెందితే రాష్ట్రానికే పర్యటక శోభ వస్తుంది. జిల్లాకూ వన్నె తెస్తుంది. ఈదిశగా ప్రభుత్వమూ అడుగులు వేసేందుకు సమాయత్తమవుతోంది. బీచ్‌ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే విశాఖపట్టణం, కాకినాడ తీర ప్రాంతాలకు భారీగా నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం సిక్కోలుపైనా ప్రణాళికలు రచిస్తోంది. రూ.వందల కోట్లు పెట్టుబడులు పెట్టేవిధంగా ప్రభుత్వ-ప్రవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కళింగపట్నం బీచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఒక ప్రైవేటు సంస్థకు దీన్ని అప్పగించినట్లు చెబుతున్నారు. రూ.300 కోట్లు వరకు ఇక్కడ పెట్టుబడులు పెట్టే విధంగా ప్రణాళిక సిద్ధమవుతోంది.

సంవత్సరం	ఆదాయం (రూ. కోట్లులో)
2014-15	515.00
2015-16	683.00
2016-17	920.00

రెండింటికీ అవకాశాలు..

జిల్లా పరిశ్రమలతో పాటు పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉంది. ఈరెండింటిని సమాంతరంగా అభివృద్ధి చేస్తే తిరుగుండదు. జిల్లాకు భారీ పరిశ్రమలు వస్తున్నా.. ఆస్థాయిలో పర్యటక రంగం అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీనిపై ఇప్పుడిపుడే దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రంలో తీర ప్రాంతంతోపాటు బీచ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న నేపథ్యంలో జిల్లాలోనూ అవకాశాలు చిగురిస్తున్నాయి. సాగర తీరంలో ప్రస్తుతం తీరం, సమద్ర జలాలు తప్ప ఎలాంటి వసతుల్లేవు. కూర్చోవడానికి బల్లలు సైతం లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

అభివృద్ధికి చర్యలు

జిల్లాలో బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కళింగపట్నం, ఇతర చోట్ల బల్లలు , ఇతర వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. కనీస వసతుల్లేని చోట్ల వసతులు కల్పిస్తాం. తీర ప్రాంత అభివృద్ధితో పర్యటకరంగం పుంజకుంటుంది. జిల్లాలో పర్యటక రంగం అభివృద్ధికి బాగా అవకాశాలున్నాయి.

–ఎన్.నారాయణరావు, జిల్లా పర్యటక అధికారి, శ్రీకాకుళం



అపరిశుభ్రత నడుమ...

కొసమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ మురుగు నీటి నిలయంగా, దోమలకు కేంద్రంగామారింది. పాఠశాలలో 280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 15 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో బోధన సాగించాల్సి వస్తోందని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. పాఠశాల ముందు ఆహ్లాదకర వాతావరణం ఉండాల్సి ఉండగా మురుగుతోనూ, నిల్వనీటితో దుర్వాసన వ్యాపిస్తోందని, వీటి మధ్య బోధన సాగించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

– కొసమాల (మెళియాపుట్టి), న్యూస్‌టుడే



కొసమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో దుస్థితి

భయం...భయం...



కడకెల్లలో ప్రమాదకరంగా



ప్రమాదకర భవనంలోనే ఇలా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది..

వీరఘట్టం మండలంలోని కడకెల్ల గ్రామంలో పశువుల ఆసుపత్రి భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. పునాదులు, గోడలు, పైకప్పు అన్నీ కాలం చెల్లినట్లు కనిపిస్తున్నాయి. ఇటువంటి భయానకమైన భవనంలో పశువైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏక్షణంలో భవనం కూలి ప్రాణనష్టం చేకూరుతుందోనని సిబ్బంది భయం భయంగా పనుల చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈభవనాన్ని కూలదోసి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని, అంతవరకు గ్రామంలోని అద్దెభవనంలో ఆసుపత్రి నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కడకెల్ల (వీరఘట్టం గ్రామీణం)



బీటలు వారిన భవనం పైభాగం